**సంపుటము–1**
**సమావేశము–XXXII**
**నంబరు. 1**

**వెల : రూ. 4–00**
**31 జనవరి, 2019**
**గురువారము**
**విళంబి నామ సం.**
**పుష్య బ. 11**

# ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు కార్యకలాపాలు
# ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL DEBATES

## అధికార నివేదిక
## OFFICIAL REPORT

## విషయ సూచిక


| క్రమ సంఖ్య | విషయం | పేజీ నం. |
|---|---|---|
| 1. | సంతాప ప్రతిపాదన<br>శాసన పరిషత్తు సభ్యులు డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి గారి మృతిపట్ల సభ సంతాప ప్రతిపాదన | .... 01–25 |


J. No. 129/19

## ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | ----- |
| డెప్యూటీ చైర్మన్ | : | శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం |
| ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీమతి పామిడి శమంతకమణి<br>డా. ఏ.ఎస్. రామకృష్ణ<br>శ్రీ ఆదిరెడ్డి అప్పారావు |
| కార్యదర్శి (ఇన్‌ఛార్జ్) | : | శ్రీ ఎమ్. విజయరాజు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ కె. సత్యనారాయణరావు<br>శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి. వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజకుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకరరావు<br>శ్రీమతి కె. భారతి<br>శ్రీమతి డి. విజయకుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు

## గురువారం, 31వ తేది, జనవరి, 2019

----

(సభ ఉదయం 11.00 గంటలకు సమావేశమైనది)

( గౌరవ ఉపాధ్యక్షులు అధ్యక్ష స్థానం వహించారు )

(జాతీయ గీతాలాపనతో సభ ప్రారంభమైంది)

<u>1.సంతాప ప్రతిపాదన :</u>

**మిస్టర్ డెప్యూటీ చైర్మన్:** ఇటీవల మరణించిన శాసనపరిషత్తు సభ్యులు డా. ఎం.వి.వి.ఎస్ మూర్తిగారి సంతాప ప్రతిపాదనను సభా నాయకులు శ్రీ యనమల రామకృష్ణుడు ప్రతిపాదిస్తారు.

<u>సంతాప తీర్మానం</u>

**SRI YANAMALA RAMAKRISHNUDU**: Sir, I beg to move..

"అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు సభ్యులైన డా. ఎం.వి.వి.ఎస్ మూర్తి గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది."

**MR. DEPUTY CHAIRMAN:** Motion moved.

**శ్రీ యనమల రామకృష్ణుడు:** అధ్యక్షా, ఈరోజున డా. ఎం.వి.వి.ఎస్ మూర్తిగారు మన శాసనపరిషత్తులో లేకపోవడం చాలా బాధాకరమైన విషయం. వారికి గోల్డ్‌స్పాట్ మూర్తిగారు అనే పేరు బాగా నానుడిలో ఉండేది. మూర్తిగారు తూర్పుగోదావరి జిల్లాకు చెందినవారైనా, వైజాగ్ సిటీకి వెళ్ళి అక్కడ స్థిర పడడం జరిగింది. ఆయన పారిశ్రామికవేత్త, విద్యావేత్త. అంతకంటే ఎక్కువగా రాజకీయవేత్త. 1982వ సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ వచ్చేవరకూ కూడా వ్యాపారంలో నిమగ్నమై గోల్డ్‌స్పాట్ మూర్తిగా పేరుపొందడమే గాకుండా ఆరోజుల్లోనే బాట్లింగ్ పరిశ్రమ పెట్టి ప్రాచుర్యంలోకి రావడం కూడా జరిగింది.

డా. ఎం.వి.వి.ఎస్ మూర్తిగారి సంస్థలన్నీ కూడా మంచి పేరు తెచ్చుకున్నాయి. వారి గీతం విశ్వవిద్యాలయం డీమ్డ్ విశ్వవిద్యాలయంగా మారడం, వారి విద్యాసంస్థలు రాష్ట్రస్థాయిలోనే గాకుండా, దేశ స్థాయిలోనూ మంచి విద్యా సంస్థలుగా గుర్తింపు పొందడం జరిగింది. ఒకవైపు విద్యావేత్తగా ఈ సమాజానికి చేసిన సేవలు, వ్యాపారవేత్తగా

ఆయన చూపించిన చొరవ వల్ల వారి ఆస్తిపాస్తులు పెరగడమే గాకుండా ఆ ప్రాంతంలో చాలామందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత కూడా డా. ఎం.వి.వి.ఎస్ మూర్తిగారిది. 1982వ సంవత్సరంలో ఎన్.టి.రామారావుగారు తెలుగుదేశం పార్టీ పెట్టినప్పుడు ఆయన తెలుగుదేశం పార్టీలో చేరడమే గాకుండా చాలా ప్రధానమైన భూమికను పోషించారు. ఆ సమయంలో మేమంతా జూనియర్స్‌గా ఉండేవాళ్ళం.

తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం మూడు జిల్లాలలో పార్టీని బలోపేతం చేయడంలో డా. ఎం.వి.వి.ఎస్ మూర్తిగారు చాలా కృషిచేశారు. ఆనాడు రాజకీయపరంగా ఎన్.టి.రామారావుగారికి చాలా సన్నిహితంగా ఉండేవారు. అదేవిధంగా ఇప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుగారితో కూడా సత్సంబంధాలు కలిగి ఉన్నారు. ఆయన రెండు పర్యాయాలు పార్లమెంటు సభ్యులుగా కూడా పని చేశారు. అంతేగాక, పార్లమెంటులో కూడా చురుకుగా ఉండేవారు. పి.వి. నరసింహారావుగారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆయన పార్లమెంటు సభ్యులుగా మంచి ఖ్యాతిని గడించారు.

అదేవిధంగా, విశాఖపట్నం ప్రాంతంలో కూడా సమాజసేవ చేసిన వ్యక్తి డా. ఎం.వి.వి.ఎస్ మూర్తిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు అనుకోకుండా డా. ఎం.వి.వి.ఎస్ మూర్తిగారిని మన శాసనపరిషత్తుకు ఎంపిక చేశారు. కొన్నాళ్ళపాటు రాజకీయాలలో గ్యాప్ వచ్చినప్పటికీ కూడా శాసనపరిషత్తుకు వచ్చాక వారు మళ్ళీ బ్రహ్మాండంగా చురుకుగా పాల్గొనేవారు. సమావేశాల సమయంలో రోజుకు రెండు, మూడు ప్రశ్నలు తప్పనిసరిగా వారివి ఉండేవి. వారు ప్రజాసేవలో ఉంటూ ప్రజలకు ఎదురయ్యే సమస్యల్ని తెలుసుకుంటూ చట్ట సభ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలనే ఆకాంక్ష, పట్టుదల కలిగిన వ్యక్తిగా శాసన పరిషత్తులో ప్రధానమైన పాత్ర పోషించారు. అందుచేత ఒక రాజకీయ నాయకులుగా, ఒక పారిశ్రామికవేత్తగా, ఒక విద్యావేత్తగా ఆయన చేసిన సేవలను ఈ సమాజం, ఈ రాష్ట్రం మరిచిపోదు.

డా. ఎం.వి.వి.ఎస్ మూర్తిగారు లేకపోవడమనేది తెలుగుదేశం పార్టీకి కూడా చాలా తీరని లోటు అని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ఒక ప్రముఖమైన నాయకుడు పార్టీలో లేకపోవడమనేది చాలా బాధాకరమైన విషయం. మళ్ళీ పార్లమెంటుకు వెళ్ళాలని చివరిగా కోరుకునేవారు. కానీ అది నెరవేర్చలేదు. ఆయన వ్యాపారరీత్యా అమెరికా వెళ్లారు. అమెరికాలో యాక్సిడెంటు జరిగింది. డా. ఎం.వి.వి.ఎస్ మూర్తిగారు చనిపోయారనే వార్త ఆరోజు ప్రసార మాధ్యమాల్లో అకస్మాత్తుగా వినగానే అందరికీ చాలా బాధనిపించింది. వారు తెలుగుదేశం పార్టీలో ప్రతి ఒక్కరితో చాలా ఆప్యాయంగా ఉండేవారు. ప్రత్యేకంగా మా జిల్లా నుంచి వచ్చారు కాబట్టి మా అందరితో చాలా ఆనందంగా, సన్నిహితంగా ఉండేవారు. అటువంటి వ్యక్తి లేకపోవడం మా జిల్లాకు, రాష్ట్రానికి కూడా నష్టమే. వారి అకాల మరణాన్ని ఎవరూ కూడా ఊహించలేకపోయారు. వారి కుటుంబానికే కాదు ఈ రాష్ట్రానికి, తెలుగుదేశం

పార్టీకి కూడా తీరని లోటు. డా. ఎం.వి.వి.ఎస్ మూర్తిగారి ఆత్మకు శాంతి కలగాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ సభ ద్వారా మనస్ఫూర్తిగా సంతాపాన్ని తెలియపరుస్తున్నాను.

**శ్రీ వి.వి.వి.చౌదరి (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, నాకు అత్యంత ఆత్మీయులు, ఆప్త బంధువు అయిన డా. ఎం.వి.వి.ఎస్ మూర్తిగారి మరణానికి సంతాపం తెలియజేసే తీర్మానాన్ని ప్రవేశపెట్టడం చాలా బాధాకరమైంది. ఈరోజున మూర్తిగారి గురించి మాట్లాడుతుంటే గొంతు కూడా మూగపోయే పరిస్థితి కలుగుతోంది. ఎందుకంటే వారితో నాకు అంతటి సుదీర్ఘమైన అనుబంధముంది. వారు నా పట్ల చూపించిన అభిమానం గుర్తుకు వస్తే గుండె బరువెక్కే పరిస్థితి. తూర్పుగోదావరి జిల్లాలో ఎస్.మూలపాలెం అనే ఒక మారుమూల గ్రామంలో జన్మించి, న్యాయవాద వృత్తిని చేపట్టి ఒక పారిశ్రామికవేత్తగా, ఒక రాజకీయ నాయకుడిగా, ఒక విద్యావేత్తగా బహుముఖ ప్రజ్ఞతో ఆయన ఈ రాష్ట్రానికి ముఖ్యంగా పార్టీకి, ప్రజలకు చేసిన సేవ అనిర్వచనీయమైనదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఏదైనా విషయం పట్ల సునిశితమైన పరిశీలన, పూర్తి పరిజ్ఞానం, దానిని ప్రజల ముందు ఉంచడంలోకానీ, ప్రభుత్వం ముందు ఉంచటంలో కానీ ఆయన భావ వ్యక్తీకరణ ప్రశంసనీయమైనది. గతంలో పార్లమెంటు సభ్యులుగా, ఇటు శాసనపరిషత్తు సభ్యులుగా చట్ట సభలకే ఒక మార్గదర్శకులుగా నిలిచారంటే అది అతిశయోక్తి కాదని మనవి చేస్తున్నాను. వారి మరణం వారి కుటుంబానికే కాదు రాష్ట్ర ప్రజలందరికీ కూడా తీరని లోటని ముఖ్యంగా పార్టీ ఒక సమర్థుడైన నాయకుడిని కోల్పోవడం నిజంగా బాధాకరమని మనవి చేసుకుంటూ వారి కుటుంబ సభ్యులందరికీ కూడా నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ.11.10

**శ్రీ సిహెచ్. అయ్యన్నపాత్రుడు:** అధ్యక్షా, ఎం.వి.వి.యస్.మూర్తిగారు శాసన మండలి సభ్యులు, సీనియర్ నాయకులు, వారు లేరనే విషయాన్ని ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నాము. తూర్పు గోదావరి జిల్లా అయినవిల్లి మండలం మూలపాలెం గ్రామంలో 1939వ సంవత్సరంలో జన్మించారు. మూర్తి గారు వ్యాపార రంగంలో విజయాలు సాధించిన విషయం మనందరికీ తెలుసు. స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావుగారు తెలుగుదేశం పార్టీ పెట్టిన తరువాత మూర్తిగారు కూడా పార్టీలో చేరడం జరిగింది. వారితోపాటు మాలాంటివారందరినీ కూడా తీసుకువెళ్లి రామారావు గారికి పరిచయం చేశారు. ఈరోజు మేము ఈ స్థాయిలో ఉన్నామంటే దానికి మూర్తిగారి సహకారం, ఆశీర్వాదం కూడా ఒక కారణం. అతనిలో ఉన్న గొప్పతనం ఏమంటే వ్యాపార రంగంలో విజయాలు సాధించారు, అలాగే రాజకీయాలలో కూడా బ్రహ్మాండంగా పనిచేశారు. "వుడా" చైర్మన్‌గా పనిచేశారు. తరువాత రెండు పర్యాయాలు ఎంపీగా పని చేసి తమ సేవలను అందించారు. గీతమ్ యూనివర్సిటీని కూడా స్థాపించారు. గౌరవ సభ్యులు యనమల రామకృష్ణుడు చెప్పినట్లు గీతమ్ యూనివర్సిటీ one of the best Universities అని మనకు తెలుసు. ఆంధ్రప్రదేశ్, భారతదేశంలోనే కాదు, విదేశాలలో కూడా గీతమ్ యూనివర్సిటీకి మంచి పేరు ఉంది. అమెరికా వంటి దేశాలలో గీతమ్ యూనివర్సిటీలో పట్టా ఉంది అంటే ఉద్యోగాలు ఇచ్చిన సందర్భాలు కూడా నాకు తెలుసు.

అలాంటి బ్రహ్మాండమైన యూనివర్సిటీని నెలకొల్పారు. ఈ మధ్యనే బ్రహ్మాండమైన హాస్పిటల్‌ను కట్టించి ప్రజల ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తీసుకోవడం జరిగింది.

అధ్యక్షా, వారిలో ఉన్న గొప్పతనం ఏమంటే ఎప్పుడూ కూడా నవ్వుతూ ఉండేవారు. వారికి కూడా కొన్ని బాధలు, ఇబ్బందులు ఉన్నప్పటికీ వారి పెదాల మీద ఎప్పుడూ చిరునవ్వు ఉండేది. మేము కొత్తగా రాజకీయాలలోకి వచ్చిన రోజులలో మాకు ఏవైనా ఇబ్బందులు, బాధలు ఉంటే మూర్తిగారిని గట్టిగా అడగాలని వారి ఇంటికి వెళ్లేవాళ్లం. కానీ గుమ్మంలోనే ఆయన నవ్వుతూ పలకరించే తీరు చూసిన తరువాత మాట్లాడకుండా మేము కూడా నవ్వుకుంటూ వెనక్కి వచ్చేసిన సందర్భాలు కూడా మాకు తెలుసు. ఎప్పుడూ నవ్వుతూ అందరినీ ఆప్యాయంగా పలకరించడమే కాకుండా, మాకు ఎప్పుడైనా సమస్యలు వస్తే వాటిని ఎంతో చాకచక్యంగా, ఓర్పుతో అందరికీ నచ్చచెప్పి సమస్యల్ని పరిష్కరించి తెలుగుదేశం పార్టీకి ఎంతో సేవ చేశారు.

అంతేకాకుండా విశాఖపట్టణం జిల్లాలో మా పార్టీకి కానీ, మాకు కానీ ఉన్న పెద్ద దిక్కు ఎవరంటే ఎం.వి.వి.యస్. మూర్తి గారు. పాతరోజులను ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటే 1982వ సంవత్సరంలో నందమూరి తారక రామారావు గారు తెలుగుదేశం పార్టీ పెట్టినప్పుడు నేను అదే సమయంలో పార్టీలో చేరడం జరిగింది. అప్పట్లో గంగిరెడ్డిగారు, ఎం.వి.వి.యస్.మూర్తిగారు, జగన్‌మోహనరావుగారు, పశ్చిమ గోదావరి జిల్లాలో బుల్లిరామయ్య గార్లు నందమూరి తారక రామారావు గారికి కుడిచేయి, ఎడమ చేయిగా ఉండి ఎంతో సహకారమందించారు. విశాఖపట్టణం జిల్లాలో ఏదైనా సమస్య ఉంటే రామారావుగారు ముందుగా మూర్తిగారికి ఫోన్ చేసి ఫలానా సమస్య ఉంది పరిష్కారం చేయండని చెప్పేవారు. గంగిరెడ్డి, ఎం.వి.వి.యస్. మూర్తి, జగన్‌మోహనరావు గార్లు ముగ్గురూ కూర్చొని ఆ సమస్యను పరిష్కారం చేసి మరలా సాయంత్రానికి ఆ సమస్య పరిష్కారమయ్యిందని రామారావుగారికి ఫోన్ చేసి చెప్పేవారు. ఒక్క విశాఖపట్టణం జిల్లాలోనే కాకుండా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో కూడా ఏవైనా సమస్యలు వస్తే పరిష్కరించడానికి తమ శాయశక్తులా కృషి చేసేవారు. అటువంటి వ్యక్తిని కోల్పోవడం మాకు చాలా లోటుగా ఉంది. మా పెద్దదిక్కు కోల్పోయినట్లుగా మేము భావిస్తున్నాము. వారు లేని లోటు తీర్చలేనిది. మూర్తిగారి మరణం వారి కుటుంబానికే కాదు, మా పార్టీకి కూడా చాలా నష్టం జరిగిందని భావిస్తున్నాము. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ కె.ఇ.కృష్ణమూర్తి:** అధ్యక్షా, మూర్తిగారు నేనూ, పార్లమెంట్‌లో ఒకేసమయంలో పనిచేశాము. ఆ సమయంలో వారితో చాలా సన్నిహితంగా మెలిగేవాడిని. ముఖ్యంగా మూర్తిగారు ఎప్పుడూ కూడా మధ్యాహ్న భోజన సమయంలో నన్ను వారి ఇంటికి తీసుకువెళ్లేవారు. ఇద్దరం భోజనం చేసి పార్లమెంట్‌కు వెళ్లేవాళ్లం. అటువంటి వ్యక్తి మన మధ్యలో లేరు అంటే చాలా బాధాకరంగా ఉంది. నిజంగా చెప్పాలంటే 24 క్యారెట్ల బంగారం లాంటి వ్యక్తి అని నేను చెప్పగలను. మేము ఇద్దరం రాజకీయాలలోకి ఒకేసారి ప్రవేశించాము. పార్టీ ఆవిర్భావం రోజు నుండి పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఆయన ఎప్పుడూ చిరునవ్వుతో మాట్లాడే స్నేహశీలి. సాంకేతిక రంగంలో

కొత్త పుంతలు తొక్కుతున్న ఈ తరుణంలో ఆధునిక పరిజ్ఞానాన్ని మన దేశంలో ప్రవేశపెట్టాలనే ఉద్దేశంతో విదేశాలకు వెళ్లి దురదృష్టవశాత్తు కారు ప్రమాదంలో అసువులు బాశారు. అమెరికాలో అక్టోబరు 6, 2018న జరుగబోయే పూర్వ విద్యార్థుల సమ్మేళనం కోసం అమెరికా వెళ్లారు. 1980లో గీతమ్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించి ఆ తరువాత డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి పెంచి ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించారు. గీతమ్ డీమ్డ్ యూనివర్సిటీ ఛైర్మన్ గానే ఆయన చనిపోయేంత వరకూ కొనసాగారు. ఆయనను ఒకప్పుడు గోల్డ్‌స్పాట్ మూర్తి అని పిలిచేవారు. ఆ తరువాత గీతమ్ మూర్తి అని పిలిచేవారు. దాదాపు 30 సంవత్సరాలు గోల్డ్‌స్పాట్ మూర్తిగానూ, మరో పది సంవత్సరాలు గీతమ్ మూర్తిగా ఆయన పేరు అందరికీ పరిచయం. ఆయన మరణం మన ఆంధ్రరాష్ట్రానికి తీరని లోటు. అదేవిధంగా మా పార్టీకి కూడా తీరని లోటు అని తెలియజేస్తూ, వారి కుటుంబానికి భగవంతుడు మేలు చేయాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ నిమ్మకాయల చినరాజప్ప:** అధ్యక్షా, ఎం.వి.వి.యస్.మూర్తి గారు కోనసీమ ప్రాంతవాసి. ఆయన కోనసీమలో పుట్టి ఆంధ్ర యూనివర్సిటీలో డాక్టరేటు చేసి విశాఖపట్టణంలో స్థిరపడి రాజకీయంగా 1983వ సంవత్సరంలో నందమూరి తారక రామారావు గారు పార్టీ పెట్టినప్పుడు రాజకీయాలలోకి ప్రవేశించారు. వుడా ఛైర్మన్‌గా, పార్లమెంట్ సభ్యుడిగా, శాసనమండలి సభ్యునిగా రావడం జరిగింది. మన మండలిలో సభ్యునిగా ఉన్నప్పుడు అనేక ప్రశ్నలు వేసి ప్రభుత్వం నుండి ఎక్కువ సమాచారం వచ్చేలా చేసిన వ్యక్తి. ఆయన కోనసీమ ప్రాంతంలో ఉన్నప్పుడు మాదగ్గరకు వచ్చి మమ్మల్ని పిలిచి పండుగకు భోజనాలు పెట్టించి సంతోషంగా గడిపేవారు. ఆయన లేకపోవడం చాలా బాధగా ఉంది. ఆయన తెలుగుదేశం పార్టీలో ముఖ్యపాత్ర పోషించి అనేక సేవలు చేశారు. గీతమ్ డీమ్డ్ యూనివర్సిటీ ద్వారా ఎడ్యుకేషన్‌ను ప్రోత్సహించడం జరిగింది. విశాఖపట్టణం, హైదరాబాదు, బెంగళూరులలో క్యాంపస్‌లు పెట్టి ఎంతోమందికి విద్యనందించారు. ఆయనలేని లోటు తీర్చలేనిది. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను.

**శ్రీ ఎస్.ఎమ్.డి.ఫరూక్:** కీర్తిశేషులు మూర్తి గారు నాకు చాలా సన్నిహిత మిత్రులు. వారు మేము అందరం కలిసి 1982వ సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీకి సేవ చేశాము. గోల్డ్‌స్పాట్ మూర్తిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. మూర్తిగారు విద్యావంతులు, మంచి రాజకీయ అనుభవం కలిగినవారు. నేను ఎప్పుడు కనిపించినా తమ్ముడూ అని పిలిచేవారు. నేను శాసనమండలి ఛైర్మన్‌గా ఎన్నికైనప్పుడు చాలా సంతోషపడ్డారు. కానీ అనుకోకుండా 02.10.2018లో వారు అకాల మరణం చెందడం చాలా బాధాకరమైన విషయం. నేను (గౌరవ డెప్యూటీ ఛైర్మన్‌ను ఉద్దేశించి) మీ ఛాంబర్‌లో కూర్చొని ఉన్నప్పుడు వారు వచ్చి "తమ్ముడూ, నేను అమెరికా వెళుతున్నాను, మరో నాలుగైదు రోజులలో వస్తాను" అని చెప్పి తిరిగి రాలేకపోయారు. చాలా బాధాకరమైన విషయం. సభ జరుగుతున్న సమయంలో వి.వి.వి.చౌదరిగారు, మూర్తి గారు కలిసి ప్రశ్నలను వేసేవారు. ఎన్నో ప్రజాహితమైన కార్యక్రమాలలో పాల్గొని అన్ని విషయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే మూర్తిగారు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. ఎప్పుడు విశాఖపట్టణం వెళ్లినా పార్టీ కార్యక్రమాలే కాకుండా వాళ్ల ఇంటికి

తీసుకువెళ్లి భోజనం పెట్టి పంపించే మూర్తిగారు లేకపోవడం చాలా బాధాకరం. వారు లేకపోవడం ముఖ్యంగా మాకు, తెలుగుదేశం పార్టీకి తీరనిలోటు. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి మనోధైర్యాన్ని కలుగ జేయాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ. 11.20

**శ్రీ నారా లోకేశ్**: అధ్యక్షా, డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి గారి అసలు పేరు – మత్కుమిల్లి వీర వెంకట సత్యనారాయణ మూర్తి. ఆయన జూలై3, 1938లో అయినవిల్లి మండలంలోని మూలపాలెం గ్రామంలో జన్మించడం జరిగింది. చాలామందికి తెలియని విషయం ఏమిటంటే, మూడు సంవత్సరముల వయస్సులోనే ఆయన తండ్రిని కోల్పోవడం జరిగింది. ఆయన నేర్చుకున్న క్రమశిక్షణ, పట్టుదల, పై చదువులు చదువుకున్నారంటే, అందుకు గల కారణం వాళ్ళ అమ్మగారు. ఆవిడ వారిని ఎంతో ప్రోత్సహించి, ఉన్నతస్థానానికి ఎదిగేలా చేశారు. పి.ఆర్. గవర్నమెంట్ కాలేజీ కాకినాడ, ఆ తరువాత ఆంధ్రా విశ్వవిద్యాలయంలో లా మరియు పిహెచ్‌డి చేశారు. తదుపరి ఆయన లాయరుగా హైకోర్టులో పనిచేయడం జరిగింది. అంతేగాకుండా, ఆనాడు సాఫ్ట్ డ్రింక్ అనే గోల్డ్‌స్పాట్ ప్లాంట్‌ని ప్రారంభించడంతో గోల్డ్‌స్పాట్ మూర్తి అన్న పేరు ఆయనకి వర్తించింది. ఒక పారిశ్రామికవేత్తగా ఆయన ఒక మార్క్ పెట్టడం జరిగింది. నేను కూడా చిన్నప్పుడు విశాఖపట్టణం వెళితే అక్కడ ఆ ప్లాంట్‌కి కూడా ఆయన నన్ను తీసుకువెళ్ళడం జరిగింది. ఇప్పటికీ నేను ఆ విషయాన్ని మరచిపోలేదు.

అధ్యక్షా, ఆయన కేవలం పారిశ్రామిక వేత్తగానే కాకుండా, విద్యావేత్తగా కూడా ఆయన వంతు కృషిచేశారు. 1980లో Gandhi Institute of Technology and Management (GITAM) University ని ప్రారంభించారు. ఈరోజున అక్కడ మూడు క్యాంపస్‌లలో 25,000 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అంతేగాకుండా, దూరవిద్య ద్వారా (Distance Education) దాదాపు లక్ష మంది విద్యార్థులు గీతం విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్నారు. ఆయన ఎప్పుడూ ఒకటి చెప్పేవారు. సమాజంలో మార్పు రావాలంటే మహిళలు చదవాలి. దానికోసం ఆయన ప్రభుత్వంతో కో–ఆర్డినేట్ చేసి, అమలాపురంలో మహిళా జూనియర్ కళాశాల, వడ్లపూడిలో అంబేడ్కర్ జూనియర్ కళాశాల, MPM Trust Agriculture Polytechnic and Engineering College, Moolapolam, Sri Seetarama Degree College At Poosapatirega, Viziangaram, లో కూడా కళాశాలలను స్థాపించి విద్యావేత్తగా ఆయన ప్రముఖ స్థానాన్ని సంపాదించుకున్నారు.

అధ్యక్షా ఆయన కేవలం పారిశ్రామికవేత్తగా, విద్యావేత్తగానే కాకుండా రాజకీయ వేత్తగా కూడా రాణించి ఆయనకంటూ ఒక మార్క్‌ను తెచ్చుకున్నారు. ఆనాడు అన్న ఎన్.టి.ఆర్.గారి పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయన ఎప్పుడూ ఒకమాట అనేవారు. నేను ఒక తప్పు చేశాను. ఆనాడు అన్నగారు నన్ను అభ్యర్థిగా ఎన్నికలలో పోటీ చేయమన్నా, ఇటు చంద్రబాబు నాయుడుగారు నన్ను పోటీ చేయమన్నా నేను చేయలేదు. వారికి

నేను ఒకటే చెప్పేవాడిని. నేను నిరంతరం పార్టీకోసం కష్టపడతానని ఆనాడు చెప్పానని, దానివల్ల నేను పోటీ చేయలేకపోయానని అనేకసార్లు, అనేక సందర్భాలలో ఆయన నాకు చెప్పడం జరిగింది.

అధ్యక్షా ఆయన 1987-89 లో Visakhapatnam Urban Development Authority(VUDA) Chairman గాను, 1989-91 వరకు తెలుగుదేశం పార్టీ కార్యదర్శిగా, 1991, 1999వ సంవత్సరాలలో పార్లమెంటు సభ్యులుగా, 2016వ సంవత్సరంలో స్థానికసంస్థల ద్వారా శాసనపరిషత్ సభ్యులుగా ఎన్నిక కావడం జరిగింది. ఆయన అధికారపక్షంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఆయన ఎల్లప్పుడూ ప్రజల పక్షంగానే ఉన్నారు. కౌన్సిల్‌లో కూడా ఆయన ఎల్లప్పుడూ ప్రశ్నిస్తూ ఉండేవారు. మా శాఖకు సంబంధించిన ప్రశ్నలు ఆయన అడుగుతుంటే మేము భయపడేవాళ్ళం. ఎందుకంటే, సభ అయిపోయిన తరువాత నేను ఎక్కడెక్కడ తప్పులు చేశానో, ఫలానా చోట ఈవిధంగా చెప్పి ఉంటే బాగుండేదని ఆయన నాకు ఒక గైడెన్స్ ఇచ్చేవారు. అంతేగాకుండా, ప్రజల సమస్యలను ఏవిధంగా పరిష్కారించాలో చెప్పేవారు. అలాగే, విద్యారంగంలో మార్పులు ఏ విధంగా తీసుకురావాలి, మహిళలకు ఏ విధంగా భద్రత కల్పించాలి, తదితర అంశాలపైన కూడా అనేక సందర్భాలలో నేను ఆయనతో కూలంకషంగా చర్చించేవాడిని.

అధ్యక్షా, నేను ఒకసారి విశాఖపట్టణం వెళ్ళినపుడు సాయంత్రం 7.00 గంటలకే భోజనానికి రమ్మన్నారు. ఆయనకు త్వరగా భోజనం చేసే అలవాటు ఉండడం వలన నన్ను కూడా భోజనానికి ఆహ్వానించారు. కానీ, నాకు అప్పుడు కుదరకపోవడం వలన రాత్రి 11.00లకు వారి ఇంటికి వెళితే, అప్పటివరకు వారు నాకోసం ఓపికగా ఎదురు చూశారు. అప్పుడు ఆయన నాకు భోజనం పెట్టిన తరువాత, దాదాపు రెండు, మూడు గంటలపాటు వివిధ అంశాలపైన చర్చించడం జరిగింది. నేను దాదాపు మూర్తిగారిని చూస్తూ పెరిగాను. అలాంటిది ఆరోజునే నేను వాస్తవంగా నేర్చును, ఓపిగ్గా ఉండడం, ఇతర విషయాలన్నింటిని ఆయన దగ్గర నుంచి నేర్చుకున్నాను. ఆరోజున నేను ఆయనతో అనేక విషయాలను మాట్లాడడం జరిగింది. వాస్తవంగా ఆంధ్రుల ఆత్మబంధువు డా.ఎం.వి.వి.ఎస్. మూర్తిగారు.

అదేవిధంగా ఆయన జీవితం నాలాంటి యువకులకు ఒక పాఠం. క్రమశిక్షణ, పట్టుదల, పనితీరును ఆయన దగ్గర నేర్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పుడు సి.హెచ్. అయ్యన్నపాత్రుడు గారు చెప్పినట్లుగా ఆయన ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారు. ఎన్ని కష్టాలున్నా, ఎన్ని ఇబ్బందులున్నా ఆయన ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడేవారు. సభకు ఎల్లప్పుడూ నిర్ణీత సమయానికి వచ్చేవారు. మొత్తం సభ అయ్యేంతవరకు తమ స్థానంలోనే కూర్చుని అంతా వినేవారు. అటువంటి క్రమశిక్షణను ఆయన దగ్గర నుంచి నేర్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అటువంటి మూర్తిగారు మరణించడం మనకు ఎంతో లోటు. ఆయన ఆత్మ శాంతించాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. నాకు మాట్లాడడానికి ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**శ్రీ సోము వీర్రాజు (శాసనసభా నియోజకవర్గం)**: అధ్యక్షా, డా.ఎం.వి.వి.ఎస్.మూర్తిగారు 1998వ సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ తరపున రాజమండ్రి నుంచి పార్లమెంటు స్థానానికి పోటీ చేయడం జరిగింది.

అప్పటి నుంచి నేను వారి శైలిని గమనించడం జరిగింది. ఇక్కడ పెద్దలందరూ చెప్పిన విషయాన్ని గమనించినట్లైతే 1982వ సంవత్సరంలోనే ప్రారంభించిన తెలుగుదేశం పార్టీలో ఆయన ప్రవేశించినప్పటికీ, రాజకీయాలలో అంచనాల విషయంలో 1998లో బీజేపి అభ్యర్థి పార్లమెంటు స్థానానికి నెగ్గడం జరిగింది. కేవలం 9,000 ఓట్లు తేడా అంతే. కానీ, ఆ 9,000 ఓట్లు పూడించుకోవడం కోసం వారు చేసేటటువంటి ప్రయత్నాలను గమనించినట్లైతే, ఎన్నికల ఓరియెంటేషన్‌లో – ఒక విషయం నేను చెప్పవచ్చో, చెప్పకూడదో తెలియదు కానీ, ఒకాయన తెలుగుదేశం పార్టీలో ప్రిన్సిపాల్ అయితే, వారు వైస్ ప్రిన్సిపాల్ ఏమోనని నాకు అనిపించింది. మేనేజ్‌మెంట్ నెగ్గాలి. అంతక్రితం విశాఖపట్టణంలో శ్రీ సుబ్బారావు గారు తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేశారు. ఆ మేయర్ ఎన్నికలను నిర్వహించడంలో, ఆ సందర్భంలో చాలాచోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు నెగ్గారు. కానీ, విశాఖపట్టణంలో సుబ్బారావు గారు నెగ్గారు. ఆ నెగ్గడం వెనకాల వారి ఆలోచన ప్రస్ఫుటంగా ఎలక్షన్స్‌ను నిర్వర్తించేటటువంటి ఓరియెంటేషన్‌లో తప్పనిసరిగా విద్య, ఇతర విషయాల బ్యాక్‌గ్రౌండ్ చూసినప్పుడు ఆ మూల కోణాన్ని గమనించినట్లైతే చాలా అద్భుతమని నాకనిపిస్తూ ఉండేది. అప్పటి నుంచి నాకు వారితో పరిచయం ఉన్నది. 2013వ సంవత్సరంలో ఒకసారి నేను ఆయనని కలిశాను. అప్పుడు వారు నాతో ఒక మాట ఇలా అన్నారు – మరలా మనం ప్రభుత్వంలో కలిసి పనిచేయవలసి వస్తుందని అన్నారు. ఆయన ఒకసారి ఎస్.బి.వి.కె. సత్యనారాయణ గారి సంవత్సరీక కార్యక్రమానికి రాజమండ్రి రావడం జరిగింది. నా సైకాలజీ వేరు అయినప్పటికీ ఆయన నన్ను పిలిపించి నువ్వు జాగ్రత్తగా ఉండాలి, నువ్వు ఎక్కువగా మాట్లాడతావు, ఎక్కువగా మాట్లాడకు అని చెప్పారు. ఈ సభకు వచ్చిన తరువాత వారిని చూస్తే, వారు మాట్లాడే తీరు, వారి శైలి నాకు చాలా ఆనందంగా అనిపించేవి. వారు అధికారపక్షంలో ఉన్నారు. కానీ, ఒక పెద్దవారు చెప్పింది ఏమిటంటే – స్వపక్షంలో విపక్షం. ఆ విధంగా ఆయన మాట్లాడేటటువంటి ధోరణిలో ఎక్కడా విపక్షంగా ఉన్నట్లు కాకుండా, ఏ మంత్రివర్యులు, ఏయే సమాధానాలు చెప్పినా మంత్రిగారు కొంత సత్యానికి దూరంగా ఉన్నారేమో! కొద్దిగా దూరం అని, మరీ ఎక్కువ దూరం అన్నా ఇబ్బంది. అంటే, గౌరవ మంత్రులు కొద్దిగా దూరంగా ఉన్నారేమోనని, వాళ్ళు చెప్పిన విషయాలు ఆయనకు నచ్చకపోతే, మంత్రులు చెప్పిన విషయాల వివరాల భావనను ఆయన విన్నప్పుడు మాకు అనిపించేది నిజంగా ఆయనను నేను ఈ హౌస్‌కి ఒక గైడెన్స్ ఫిలాసఫర్‌గా భావించేవాడిని. ఎప్పుడూ వారి వెనకాల నేను వెళ్ళేవాడిని. ఆయన చిరునవ్వు గానీ, ఆయన మెళ్ళో వేసుకునే షాల్ గానీ ఆయన ఎప్పుడూ ఎంతో నీట్‌గా ఉండేవారు.

అధ్యక్షా, నేను వారి పి.ఏ.ని బయట చూసేవాడిని. ఈయన కంటే, ఆ పి.ఏ. ఇంకా ఎక్కువ నీట్‌గా ఉండేవారు. ఆయనది కూడా మా జిల్లానే. వారిద్దరూ కలిసి చనిపోవడం దురదృష్టం. మా జిల్లాలో ఎన్నికలకి వెళ్ళినప్పుడు వారి పి.ఏ. గారు అక్కడ ఏం జరిగిందనే విషయాలు చెప్పేవారు. అక్కడ వారి అనుబంధం గానీ, ఇద్దరూ కలిసి చనిపోవడం కానీ, ఆ చావుకోసం అంత దూరం మూర్తిగారు వెళ్ళారా? నేను తెలుగుదేశం పార్టీలో లేకపోయినప్పటికీ, ఆ జరిగిన సంఘటనను జీర్ణించుకోవడం మాత్రం చాలా కష్టమైంది. ఇక్కడ పెద్దలందరూ చెప్పిన విషయాలను నేను మనస్ఫూర్తిగా

ఏకీభవిస్తున్నాను. వారు మనకు సభలో లేనందుకు ఈ విధంగా ఈ పరిణామం జరిగిన సందర్భంలో వారి కుటుంబానికి నేను ప్రగాఢంగా విచారాన్ని వ్యక్తం చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ.11.30

**డా.ఎ.ఎస్.రామకృష్ణ (ఉపాధ్యాయ నియోజకవర్గం - కృష్ణా, గుంటూరు):** అధ్యక్షా, డా. ఎమ్.వి.వి.ఎస్.మూర్తిగారు ఈ సభలో లేకపోవడం ఆయనకు సంతాపం ప్రకటించడం నిజంగా చాలా బాధాకరం. నాకు ఆయనతో తక్కువ పరిచయం ఉన్నప్పటికీ గత మూడు, నాలుగు సంవత్సరాలుగా ఎంతో ఆప్యాయంగా ప్రతి ఒక్కరినీ పలకరించడం నేను గమనించాను. ఆయన వ్యక్తిత్వం చాలా గొప్పది. మాలాంటి వారు ఈ చట్టసభల్లో ఆయన దగ్గర నుండి ఎన్నో నేర్చుకోవాలని నాకు అనిపించింది. ఒక వ్యక్తి గానే కాదు, సామాజిక సేవాతత్పరుడిగా, పర్యావరణవేత్తగా, మంచి విద్యావేత్తగా అనేక అంశాలపై అలవోకగా ఏమాత్రం దాచుకోకుండా ఓపెన్‌గా, ధైర్యంగా, ఒకధీశాలిగా ప్రతి అంశంపై ఆయన మాట్లాడడం గమనించినప్పుడు ఆయన దగ్గర నుండి మేము ఈ సభలో ఏవిధంగా మాట్లాడాలో నేర్చుకోవడం జరిగింది. ఆయన ఆకస్మికంగా మరణించడం మనకే కాకుండా, మొత్తం సమాజం అంతటికీ లోటని అనుకుంటున్నాను. ఆయన జీవితం ఆదర్శవంతమైనది.

అధ్యక్షా, 1979లో నేను ఆంధ్రా యూనివర్సిటీలో చదువుకునేటప్పుడు ఆయనను గోల్డ్‌స్పాట్ మూర్తిగా పిలవడం విన్నాను. అయన గురించి నాకు అప్పుడు పెద్దగా తెలియదు. ఆయనను ఎప్పుడూ చూడలేదు. ఒక పారిశ్రామికవేత్తగా మాత్రమే తెలుసు. కానీ ఈ సభలోకి వచ్చిన తరువాత మూర్తిగారిని చూసి 1979లో మేము విన్న మూర్తిగారేనా ఈయన అని అనిపించింది. గౌరవ సభ్యులు వి.వి.వి.చౌదరిగారు, ఎమ్.వి.వి.ఎస్ మూర్తిగారు జంటకవులవలె ఉండేవారు. ఆయన చాలా సందర్భాలలో అనేక అంశాలపైన ప్రశ్నలు వేస్తూ ఉండేవారు. ఆయనకు ఉన్న ఓపిక మనకు లేదేమోననిపిస్తుంది. బాధ్యతాయుతమైన సభ్యులుగా చట్టసభల్లో ఏవిధంగా ప్రవర్తించాలో ఆయన నుంచి మనం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ఆయన లేకపోవడం వ్యక్తిగతంగా నాకైతే పెద్దలోటుగా అనిపిస్తోంది. అటువంటిది ఈరోజు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఈవిధంగా మాట్లాడడం నాకు చాలా బాధగా ఉంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ఈ సందర్భంగా నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ తమరు నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

**శ్రీ ఆదిరెడ్డి అప్పారావు (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, డా. ఎమ్.వి.వి.ఎస్.మూర్తిగారికి నాకు వయస్సులో వ్యత్యాసం ఉన్నా మేము చాలా స్నేహంగా ఉండేవాళ్లము. వారు అనుకోని విధంగా అకస్మాత్తుగా మరణిస్తారని ఎవరూ ఊహించలేదు. ఆయన అమలాపురం ప్రాంతం దగ్గర మూలపాలెం గ్రామంలో జన్మించి "గోల్డ్‌స్పాట్ మూర్తిగా" మంచి పేరు పొందారు. ఆ తదుపరి ఒక విద్యావేత్తగా పేరు పొందారు. వారు గీతం కాలేజీలను ఏర్పాటు చేసి మంచి పేరు ప్రఖ్యాతులు పొంది అక్కడ కూడా "గీతం మూర్తిగా" పేరు పొందారు. తరువాత మన

పెద్దలు చెప్పినట్లుగా ఆ సంస్థలు డీమ్డ్ యూనివర్సిటీగా రూపొందాయి. అత్యుత్తమ విలువలు గల విద్యను వ్యాప్తి చేయడంలో తనదైన పాత్రను వహించినటువంటి వ్యక్తి మన మూర్తిగారు.

అధ్యక్షా, అయన ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారు. మంచి చెడుల విషయంలో, గెలుపు ఓటములు ఉన్నప్పుడు దేనినైనా మనం స్పోర్టివ్‌గా తీసుకోవాలి తప్ప మనం ఎప్పుడూ బాధపడకూడదని ఆయన అనేక సందర్భాలలో చెప్పేవారు. ఆయన రాజమండ్రి నుండి పార్లమెంటుకు పోటీ చేసినప్పుడు అందరం కష్టపడ్డాము. దురదుష్టవశాత్తు ఆ సీటు కోల్పేతే రిజల్టు వచ్చిన మరుసటి రోజునే ఆయన మాఇంటికి వచ్చి ఏమిటి నీవు బాధపడుతున్నావంటా? గెలుపు ఓటమి అనేవి దైవాధీనం. అలా బాధపడితే ఎలా? గెలుస్తాము, ఓడతాము. నీవు ఏమీ బాధపడకు నేను మధ్యాహ్నం మరలా మీఇంటికి భోజనానికి వస్తానని చెప్పారు. మీరు చాలా చక్కగా పని చేశారని, మీరు చాలా స్పోర్టివ్‌గా తీసుకోవాలని నాతో అన్నారు. ఎప్పుడు వైజాగ్ వచ్చినా మీరు మాఇంటికి రావాలని చెప్పారు. ఎవరైనా కష్టపడి పనిచేస్తే వారిని గుర్తించే వ్యక్తి మన మూర్తిగారు. ఆయన చెప్పినట్లుగా మధ్యాహ్నం మాఇంటికి వచ్చి భోజనం చేసి మీరు ఎవరు వైజాగ్ వచ్చిన మాఇంటికి తప్పనిసరిగా రావాలని నా భార్యకు కూడా చెప్పారు. అభిమానం, ఆప్యాయత అనేది వారిలో ఎప్పుడూ కనపడుతూ ఉంటుంది. నేను ఎప్పడు వైజాగ్ వెళ్లినా చాలా బాగా మాట్లాడేవారు. ఏదైనా సీటు గురించి సిఫారసు చేస్తే నీవు లెక్చరర్‌వి కదా! మెరిట్‌ను మనం పాడుచేయకూడదు. ఆర్థికంగా సహాయం కావాలంటే చేస్తాను అనేవారు. మెరిట్ ఉండి ఆర్థిక సహాయం కావాలంటే చేస్తానని అనేక పర్యాయాలు మాకు సహాయాన్ని అందించినటువంటి వ్యక్తి ఆయన. కష్టపడి పనిచేసేవారిని గుర్తించి వారికి తిరిగి సహాయం చేయాలని భావించే వ్యక్తి. అదేవిధంగా మన సభలో కూడా ఏవిషయంలోనైనా ముఖ్యంగా ఎడ్యుకేషన్ విషయంలో మాట్లాడేటప్పుడు సమాధానం సరిగా రాకపోతే దానిని రాబట్టేవరకూ మాట్లాడేవారు. రాజీ పడేవారు కాదు. ఎవరైనా తప్పు చేస్తే మీరు తప్పు చేస్తున్నారని కచ్చితంగా ఖండించే వ్యక్తి. అటువంటి వ్యక్తి ఈ రోజు లేకపోవడం చాలా దుర దృష్టకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

**శ్రీ చిక్కాల రామచంద్రరావు (స్థానిక సంస్థలు - తూర్పు గోదావరి):** అధ్యక్షా, డా. ఎమ్.వి.వి.ఎస్.మూర్తిగారు ఇప్పటి వరకూ శాసనమండలిలో ఉండి ఇప్పుడు లేకపోవడం చాలా దురదృష్టకరం. ఆయనకు ఈ రకంగా సంతాపం ప్రకటించడానికి నేను చింతిస్తున్నాను. ఎందుకంటే ఆయన చాలా మంచి మనిషి. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేవారు. అంతేకాకుండా చిరునవ్వుతో ఉండి ఏ విషయాన్నైనా ఓపెన్ మైండ్‌తో చాలా క్లియర్‌గా, స్పష్టంగా చర్చించేవారు. అదేవిధంగా ఇక్కడ మన కౌన్సిల్‌లో కూడా ఎక్కువ ప్రశ్నలు వేసింది మన ఎమ్.వి.వి.ఎస్.మూర్తిగారే. ప్రతిపక్షమూ, అధికారపక్షమూ అనే విధానం లేకుండా ఆయన అన్ని ప్రశ్నలను కూడా పాజిటివ్‌గా, నెగెటివ్‌గా రెండూ కూడా అడిగేవారు. ఎందుకంటే మనసులో ఉన్న భావాలు బయటకు రావాలని, ఒక సరైన సమాధానం రావాలనే ఉద్దేశంతో ప్రశ్నించేవారు.

అధ్యక్షా, అయన మా తూర్పుగోదావరి జిల్లా, అయినవిల్లి మండలం, మూలపాలెం గ్రామంలో జన్మించారు. అయన కాకినాడలో పి.ఆర్.ప్రభుత్వ కళాశాలలో చదువుకున్నారు. ఆ తరువాత విశాఖపట్నంలో లా డిగ్రీ సంపాదించి న్యాయవాదిగా హైకోర్టులో న్యాయవాద వృత్తి చేపట్టి ఒక మంచి న్యాయవాదిగా పేరుపొందారు. ఆయన దృష్టి వ్యాపారరంగం వైపు మళ్లిన తరువాత ఆయన గోల్డ్‌స్పాట్ బాట్లింగ్ కంపెనీ పెట్టి గోల్డ్‌స్పాట్ మూర్తిగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద పేరు తెచ్చుకున్నారు. వ్యాపారరంగంలోనే కాకుండా విద్యారంగంలోకి రావాలనే ఉద్దేశంతో ఆయన గీతం యూనివర్సిటీను నెలకొల్పారు. అంతకు ముందు అమలాపురంలో మహిళా జూనియర్ కాళాశాల, విశాఖపట్నంలో అంబేడ్కర్ జూనియర్ కళాశాలల ఏర్పాటుకు కృషి చేశారు. అదేవిధంగా విజయనగరంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం జరిగింది. గాంధీగారి స్ఫూర్తితో గీతం – గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ అని పేరు పెట్టడం జరిగింది. గీతం యూనివర్సిటీ నెలకొల్పిన తరువాత గోల్డ్‌స్పాట్ మూర్తిగా పేరు పొందిన ఆయన గీతం మూర్తిగా ప్రసిద్ధి పొందారు.

అధ్యక్షా, మన గౌరవ మంత్రి శ్రీ లోకేశ్‌గారు చెప్పినట్లుగా ఆయన ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూషన్స్ బాగా వ్యాప్తి చెందాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కూడా గీతం యూనివర్సిటీకు మంచి పేరు ఉంది. గీతం యూనివర్సిటిలో సీటు రావడం చాలా కష్టంగా ఉండేది. మంచి కాంపిటేషన్ ఉన్న విద్యాసంస్థ. మంచి డిసిప్లిన్‌తో ఉండే విధంగా యూనివర్సిటీని ఆయన తయారు చేశారు. మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. విద్య పట్ల ఆయనకు ఉన్న అభిమానంతో సేవ చేయాలనే భావనతో వారు ఈ సంస్థలను ఏర్పాటు చేయడం జరిగింది.

ఉ.11.40

అధ్యక్షా, 1982లో శ్రీ నందమూరి తారక రామారావు గారు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పుడు మేమంతా పార్టీలో చేరాం. ఆయన తెలుగుదేశం పార్టీలో ఉంటూ ఒక మంచి నాయకుడిగా, ఒక మంచి కార్యకర్తగా కూడా పార్టీకి పనిచేశారు. ఆ తరువాత ఆయన వుడా చైర్మన్‌గా, జనరల్ సెక్రటరీగా కూడా పనిచేశారు. ఆ తరువాత ఆయన 1991లో పార్లమెంట్ సభ్యునిగా పోటీ చేశారు. అప్పుడు శ్రీ నందమూరి తారక రామారావు గారు, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఇద్దరు కలిసి నన్ను అక్కడ పరిశీలకునిగా నియమించారు. ఆ ఎన్నికల్లో చాలా తక్కువ మెజార్టీతోనే గెలవడం జరిగింది. ఆ సమయంలో గెలవడమే ఎంతో గొప్ప విషయం. కారణం ఏమిటంటే రాజీవ్ గాంధీ గారు చనిపోయిన తరవాత జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీగా బ్రహ్మాండంగా సీట్లు వచ్చినా, ఆ తరవాత జరిగిన ఎన్నికలలో చాలా సీట్లు ఓడిపోవడం జరిగింది. అప్పుడు చుట్టుప్రక్కల మొత్తం ఈయనొక్కరే తొమ్మిది వేల మెజార్టీతో గెలుపొందారు. ఎందుకంటే సానుభూతి మొత్తం కాంగ్రెస్ పార్టీకే పనిచేసింది. అట్లాంటి నాయకుడైన వారితో నాకు అప్పటి నుంచే చాలా దగ్గరి సంబంధముంది. నేనంటే ఆయనకు చాలా ప్రత్యేకమైన గౌరవం కూడా ఉండేది. ఆయన 1999లో పార్లమెంట్ సభ్యునిగా గెలిచిన తరువాత పార్లమెంట్‌లో రాష్ట్ర సమస్యలు,

విశాఖపట్టణం సమస్యల గురించి ఆయన వివరించేవారు. ఆ తరువాత 2015 నుంచి మన శాసనపరిషత్తులో సభ్యునిగా ఉండడం వలన ఆయన పద్ధతిని, తీరును కూడా చూడటం జరిగింది. అటువంటి మంచి నాయకుడిని కోల్పోవడం చాలా దురదృష్టం. వారి మృతికి నా సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ బి.ఎన్. రాజసింహులు (స్థానిక సంస్థలు – చిత్తూరు):** అధ్యక్షా, డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి గారి సంతాప తీర్మానంలో పాల్గొంటానని నేను ఎప్పుడు అనుకోలేదు. ఎందుకంటే ఆయన అమెరికా వెళ్లే ముందు మా అబ్బాయి ఫోన్ నెంబర్‌ను తీసుకుని వెళ్లారు. ఎందుకని ఇది చెబుతున్నానంటే, 1995లో మా అబ్బాయి ఇంటర్ అయిపోయిన తరవాత డిగ్రీ కోసం దాదాపు పది కాలేజీల వరకు పరిశీలించి చివరకు గీతం కాలేజీని ఎంచుకున్నాడు. ఎందుకంటే అక్కడి పిల్లల్లో ఉన్న క్రమశిక్షణ, వాతావరణం బాగుందని నేను అక్కడే చదవాలని అన్నప్పుడు నేను నేరుగా ముఖ్యమంత్రి గారి దగ్గరకు వెళ్లి మా అబ్బాయికి ఇంజనీరింగ్ సీటు కావాలని అడిగితే అప్పుడు మూర్తి గారికి ఫోన్ చేసి చెబితే ఆయన ఏ కోర్సు కావాలని అడిగితే కంప్యూటర్ సైన్స్ కావాలని చెప్పాం. దాని కన్నా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ బాగుంటుందని భవిష్యత్‌లో ఆ కోర్సే మన దేశంలో బాగుంటుదని చెప్పారు. అది చదివిన తరువాత మా అబ్బాయి యుకె వెళ్లి ఎం.ఎస్. చేసి, మరలా చికాగోలో JP Morgan Chase Bank లో వైస్ ప్రెసిడెంట్ కేడర్‌కి చిన్న వయస్సులో వచ్చాడని మొన్న అమెరికాకు వెళ్లేటప్పుడు చెప్పాను. Old Boys Association Function పెడుతున్నారు అక్కడ నేను కలుస్తానని ఫోన్ నెంబర్ తీసుకుని వెళ్లారు. ఆ తరువాత ఈ సంఘటన జరిగిందని తెలిసిన వెంటనే చాలా బాధ కలిగింది. ఎందుకంటే ఆ కాలేజీలో చేర్చడమే కాదు, ఒకసారి మా ఇద్దరు అబ్బాయిలను తీసుకువెళ్లినప్పుడు వారిద్దరినీ ఇంటర్వ్యూ చేశారు. ఆయన వారికి కొన్ని సూచనలు కూడా చేశారు. మా అబ్బాయి ఫోన్ చేసి కారులో నలుగురు ఉన్నారు వారిలో మీ ఎమ్మెల్సీ గారు, మరో వ్యక్తి చనిపోయారని చెప్పినప్పుడు ఆరోజు మా కుటుంబమంతా బాధపడ్డాము. ఎందుకంటే మా కుటుంబానికి ఒక ఎడ్వైజర్ లాగా మేము వారి దగ్గరకు వెళ్లినప్పుడు చాలా బాగా ట్రీట్ చేసేవారు. నిజంగా ఆ విషయాలను ఎప్పటికీ మరచిపోలేము. ఈరోజు వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ముగిస్తున్నాను.

**శ్రీ ద్వారపురెడ్డి జగదీశ్వరరావు (స్థానిక సంస్థలు – విజయనగరం):** అధ్యక్షా, డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి గారు ఒక సీనియర్ పొలిటీషియన్, వెటరన్ పొలిటీషియన్, ఏబుల్ పార్లమెంటేరియన్. మనందరితో ఈ సభలో వారు ఉండేటప్పుడు హౌస్ అంతా ఎనర్జిటిక్‌గా, యాక్టివ్‌గా ఉండేది. ఈరోజు ఆయన మన మధ్యలో లేకపోవడం చాలా దురదృష్టంగా భావిస్తున్నాను. ఆయన రాజకీయలలో గానీ, విద్యలో గానీ, వ్యాపారంలో గానీ మానవతా విలువలను చూసేవారు. వాటికి ప్రాధాన్యత ఇచ్చే కార్యక్రమాలు కూడా చేసేవారు. ఏది చేసినా పట్టుదలతో విజయం సాధించే వరకు నిద్రపోకపోవడం అనేవి ఆయన నుంచి స్ఫూర్తిగా మనం తీసుకుంటున్నాము. అలాగే ఆయన ఇంజనీరింగ్ కాలేజీని పెట్టడం తోబాటు గాంధియన్ స్కూల్ ఆఫ్ థాట్ అనే కోర్సును గీతం విశ్వవిద్యాలయంలో

పెట్టి మహాత్మా గాంధీ గారి బయోగ్రఫీ తోబాటు, ఆయన లైఫ్ సైకిల్ అంతా అక్కడ ఎగ్జిబిషన్ ఉంటుంది. అసలు ఆ రేర్ కలెక్షన్ ఆయన మహాత్మా గాంధీ గారి మీద ఉన్న ఫెయిత్ గానీ, ఆయనకు ఉన్న రెస్పెక్ట్ గానీ చూస్తే మూర్తి గారు ఇంతటి మహానుభావుడా అనేది దీనిలో కనిపిస్తుంది. అంతకు ముందు ఆయనతో ఈ సభలో ఉండటమే కాదు, అలాగే ఎథిక్స్ కమిటీ చైర్మన్ ఆయన ఉండటం అందులో మేము మెంబర్స్‌గా ఉండి చాలా టూర్లకు మేమంతా కలిసి వెళ్లడం వలన ఎప్పుడూ ఎదో ఒకటి నేర్చుకోవడానికి వీలుండేది. ఒకసారి ఆయనతో పరిచయం ఏర్పడితే ఆయనను మరచిపోవడమనే ప్రసక్తి లేదు. అంత అభిమానం, ఆప్యాయతతో అందరినీ ఆకట్టునే గొప్ప వ్యక్తి, మహానుభావుడాయన. అటువంటి ఆయన ఈరోజు మనతో లేకపోవడం దురదృష్టంగా భావిస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, అదే విధంగా ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ బచ్చుల అర్జునుడు (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, ఆయనను చూస్తేనే గౌరవం కలిగేటువంటి వ్యక్తి. అటువంటి వ్యక్తిత్వం కలిగినటువంటి వ్యక్తి డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి గారు. ఆయన విద్యావేత్తగానే కాకుండా వ్యాపారవేత్తగా, మానవతావాదిగా అందరి హృదయాల్లో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన ఈ సభలో ఎప్పుడు చూసినా ప్రారంభ సమయానికే ఉండటం, అలాగే సునిశితమైనటువంటి అంశాల మీద స్పందించడం, తప్పని సరిగా ప్రతిరోజూఆయనకు స ంబంధించిన రెండు ప్రశ్నలుండేవి. అవి కూడా ప్రభుత్వంలో జరుగుతున్న సునిశితమైన తప్పుల్ని ఎత్తి చూపించి అది ప్రజలకు మేలు జరగాలని ఆకాంక్షించేవారు. ఆయన విద్యావేత్తగానే కాకుండా రాజకీయవేత్తగా కూడా ఆదర్శవంతమైన వ్యక్తిగా కనిపించేవారు. ఎప్పుడు సమయం దొరికినా ఆయన దగ్గర కూర్చొని నాలుగు మాటలు మాట్లాడితే చాలా రాజకీయ విషయాలపై లోతుగా విశ్లేషణ చేయగలిగిన, అనుభవం కలిగిన వ్యక్తి ఈరోజున మన మధ్యన లేకపోవడం నిజంగా చాలా బాధాకరం.

అధ్యక్షా, మనం కమిటీతో విశాఖపట్నం వెళ్లినప్పుడు మూర్తి గారిని కలుద్దామని వెళితే సాదరంగా ఆహ్వానించి ఆత్మీయతను పంచినటువంటి వ్యక్తి ఆయన. అలాంటి వ్యక్తి ఈరోజున ఈ సభలో లేనందుకు చాలా బాధాకరంగా ఉంది. అయినా ప్రతి వ్యక్తికి మరణమనేది తప్పదు కాబట్టి, అలాంటి ఆదర్శవంతమైన వ్యక్తుల దగ్గర నుండి నేర్చుకున్నట్టి విషయాలు జీవితాంతం జ్ఞాపకాలతో మిగిలిపోతాయి. అందుకే అలాంటి మహోన్నతమైన వ్యక్తి మృతికి నా సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబానికి కూడా నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

**శ్రీ కరణం బలరామకృష్ణ మూర్తి (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి గారి తోబాటు 1999- 2004వ సంవత్సరం వరకు ఎంపీగా నేను కూడా పనిచేయడం జరిగింది. ఆయన ఒక స్పష్టమైనటువంటి అవగాహనతో, ఆరోజు జరగబోయే అజెండాను పరిశీలించి, మధ్యలో వాటిని గురించి వివరణ కోరుతూ యాక్టివ్‌గా ఉండేవారు. ఆరోజుల్లో బోళ్ల బుల్లిరామయ్య గారు, మూర్తిగారు వీరిద్దరూ ఎప్పుడూ చాలా సంతోషంగా ఉండేవారు.

ఉ.11.50

అదేవిధంగా, పార్టీ విషయానికి వచ్చేటప్పటికి ప్రతి అంశాన్ని గమనిస్తూ, హైకమాండ్ ఇచ్చిన ఆదేశాల్ని తూ.చ. తప్పకుండా పాటించే విషయంలో నిర్మొహమాటంగా ఆయన అభిప్రాయాల్ని చెప్పేవారు. ఆవిధంగా చెప్పిన తరువాత, ఒక నిర్ణయానికి వచ్చిన తరువాత వాటిని పాటించే మనస్తత్వం కలిగిన వ్యక్తి ఆయన. ఈ సందర్భంగా వారు మన మధ్యన లేకపోవడం చాలా బాధాకరమైన విషయం.

అదేవిధంగా నాకు ఆయనతో దాదాపు 33 సంవత్సరాల అనుబంధం ఉంది అధ్యక్షా. 1985 నుండి నాకు వారితో మంచి సంబంధాలున్నాయి. చివర్లో మేం కూడా కాసేపు మాట్లాడటం జరిగింది. మన సభ్యులు శ్రీ వి.వి.వి.చౌదరి గారు, డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి గారు సభలోకి ఎప్పుడు వస్తారా అని ఆయన సీటువైపు చూస్తుండే వారు. ప్రతిరోజూకూడా ఆయన ప్రశ్నలు అడిగేవారు. ఇందాకే సభ్యులు శ్రీ బచ్చుల అర్జునుడు గారు చెప్పినట్లు, అజెండాలో కనీసం 2 ప్రశ్నలైనా వారిద్దరివి ఉండేవి. ఈ సందర్భంగా వారిచ్చే సూచనలు గమనిస్తే, మంత్రులు ఎవరైనా సరైన సమాధానం చెప్పలేకపోయినప్పుడు సౌమ్యంగానే దాన్ని రెక్టిఫై చేసుకోవాలని సూచనలు చేయడమన్నది మనమందరం చూసిన విషయమే. ఈ సందర్భంగా ఆయన లేని లోటు మనమెవ్వరం తీర్చలేనటువంటి విషయమని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ప్రకాశం జిల్లాతో ఆయనకు మంచి అనుబంధం ఉంది. పార్టీ విషయానికి వచ్చేటప్పటికి మా జిల్లాలో ప్రతి ప్రాంతంలో కూడా ఆయన తిరిగిన సందర్భాలున్నాయి, ఎన్నో రోజులు అక్కడ గడిపారు. దీంతోబాటు, మరో విషయమేమంటే బహుశా చాలామంది సభ్యులకు తెలిసుండకపోవచ్చు. ఆయన తూర్పుగోదావరి జిల్లాలో పుట్టి, వ్యాపారరీత్యా విశాఖపట్నంలో సెటిలయ్యారని చెప్పడం జరిగింది. కానీ, వారి పూర్వీకులు మాత్రం గుంటూరు జిల్లా, గురజాల ప్రాంతం నుండి వచ్చారు. ఎందుకంటే, ఆయనే స్వయంగా మాతో ఈ విషయాన్ని చెప్పడం జరిగింది. వారి పూర్వీకులు గురజాల నుండి వచ్చి, విశాఖపట్నంలో సెటిలైపోయి తరువాత వ్యాపారరంగాన్ని విస్తరించడం జరిగిందనే విషయాన్ని, ప్రకాశం జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో వారే మాతో స్వయంగా చెప్పడం జరిగింది. అలాంటిది, ఈ రోజున ఆయన మన మధ్యన లేకపోవడమనేది చాలా బాధాకరమైన విషయం. కాబట్టి, ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను అధ్యక్షా.

**శ్రీ బొడ్డు నాగేశ్వరరావు (పట్టభద్రుల నియోజకవర్గం - కృష్ణా, గుంటూరు) :** అధ్యక్షా, డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి గారి మరణం ఒకవిధంగా చెప్పాలంటే ఆకస్మిక మరణం. ఈ సభకు కూడా తీరని లోటని భావిస్తున్నాను. ఈ సందర్భంగా వారి మరణానికి వ్యక్తిగతంగానూ, మా ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ పక్షాన కూడా తీవ్రమైన సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢమైన సానుభూతిని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి గారు లాయర్‌గా జీవితాన్ని ప్రారంభించిన వ్యక్తి. అకుంఠిత దీక్ష, పట్టుదల, క్రమశిక్షణతో మంచి పారిశ్రామికవేత్తగా, విద్యావేత్తగా, పర్యావరణవేత్తగా, పార్లమెంటేరియన్‌గా ఎదిగి అటు పార్లమెంటులో గాని, ఇటు శాసనపరిషత్తులో గాని వారు చేసిన సేవలు మరువలేనివని ఒకసారి గుర్తు చేస్తున్నాను. వారు అధికారపక్షంలో ఉన్నప్పటికీ కూడా ప్రజల పక్షాన సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాలను కూడా చాలా చక్కగా సభ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తూ, ఒకరకంగా మా అందరికీ కూడా ఆదర్శనీయమైన వ్యక్తిగా, చట్టసభల గౌరవాన్ని, విలువల్ని కాపాడే వ్యక్తిగా మనం వారిని కోల్పోవడమనేటటువంటిది ఈ సభకే కాదు, ప్రజలకు కూడా తీరని నష్టమని భావిస్తూ, మరోమారు వారి మరణంపట్ల ప్రగాఢమైనటువంటి సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్ (పట్టభద్రుల నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం):** అధ్యక్షా, డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి గారు మాకు పితృసమానులైన వ్యక్తి. ఇంట్లో అతి చిన్న వయస్సు నుండే దగ్గరగా వారిని చూడటం జరిగింది. మా నాన్నగారికి అత్యంత సన్నిహితులు వారు. ఆయన, గంగిరెడ్డి గారితో కలసి అనేకమార్లు, అనేక రాజకీయ విషయాలు దగ్గరగా చూడటం జరిగింది. వారు మా ఇంటికి కూడా అనేకసార్లు రావడం జరిగింది. ముఖ్యంగా ఆయన స్థాపించిన గీతం సంస్థతో కూడా నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. నేను మేనేజ్‌మెంట్ స్టూడెంట్‌ని. పైగా కాస్ట్ అకౌంటెంట్‌ని. అలా ఆ మేనేజ్‌మెంట్‌తో కలిసి అనేకరకాల కార్యక్రమాలు కూడా చేపట్టడం జరిగింది. వారు గీతం ఇంటర్నేషనల్ బిజినెస్ స్కూల్‌ని పెట్టడం జరిగింది. ఆ ఇంటర్నేషనల్ బిజినెస్ స్కూల్‌తో సంబంధం కలిగి, నా మిత్రులు అనేకమంది అక్కడ చదువుకుని, అక్కడే లెక్చరర్లుగా పనిచేసిన సందర్భంలో నేను కూడా అనేకసార్లు అక్కడికి వెళ్లడం, మూర్తిగారితో కలిసి మాట్లాడటం, అనేక కార్యక్రమాల్లో వారితో కూడా కలిసి చేయడం జరిగింది.

అధ్యక్షా, నిజంగా ఆయనకు మానసపుత్రిక అంటే గీతం విశ్వవిద్యాలయం అని చెప్పాలి. ఆ విధంగా ఆ ఇన్‌స్టిట్యూషన్‌ని ప్రారంభించడం జరిగింది, అలాగే డెవలప్ చేయడం జరిగింది. నాకు చాలాసార్లు ఆశ్చర్యం కలుగుతుంది. అంటే ఒక్కొక్క డిపార్టుమెంట్, ఒక్కొక్క ఇన్‌స్టిట్యూషన్ కలుపుకుంటూ పోతుంటే, దానికొక ప్రత్యేకత ఉండాలని ఆయన తాపత్రయపడే తీరు గాని, అలాగే నేను ఇచ్చేది ఏదైనాసరే బెస్ట్ ఇవ్వాలనే ఒక ప్రయత్నం చేస్తుండేవారు. ఇన్‌స్టిట్యూషన్ అంటే కేవలం ఒక్క బిల్డింగ్ మాత్రమే కాదు, దాంతోపాటు ఫ్యాకల్టీ ఉండాలని చెప్పి దేశవిదేశాల నుండి బెస్ట్ ఫ్యాకల్టీని తీసుకువచ్చిన తీరును చూస్తే, చాలాసార్లు నాకు ఆశ్యర్యం కలుగుతుంది.

అధ్యక్షా, నాకు అత్యంత ఇష్టమైన వ్యక్తి ప్రొఫెసర్ సి.ఎస్.వెంకటరత్నం గారు. ఆయన Professor in Economics. ఆయన పుస్తకాలు చదవడం వల్ల, ఆయన్ని కలవాలని చాలాసార్లు అనుకోవడం జరిగింది. అయితే, ఆయన రిటైరైన తరువాత డా.ఎం.వి.వి.ఎస్.మూర్తిగారే స్వయంగా ఆయన్ని అమెరికా నుండి తీసుకువచ్చి, గీతం

విశ్వవిద్యాలయంలో Professor of Emeritus గా నియమించాలన్నప్పుడు, నేను వారిని స్వయంగా కలవడం జరిగింది. సార్, నేను మిమ్మల్ని చాలా అభిమానిస్తానని వారికి చెప్పడం జరిగింది. ఆ సందర్భంగా డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి గారిని కలిసి, ఎక్కడ నుండి ఈ విధంగా అనేకమంది మేధావుల్ని మీరు తీసుకువస్తారని అడిగితే, నేను ఎక్కడికి వెళ్లినా ఈవిధంగా సెర్చ్ చేస్తుంటాను, ప్రొఫెసర్స్ ఎవరైనా ఉంటే కలుస్తుంటాను, వాళ్లు రిటైరైన తరువాతగాని, మధ్యలో ఎక్కడైనా టీచింగ్ వదిలేసి రావాలనుకుంటే నేను ఆఫర్ ఇస్తుంటాను, బెస్ట్ ఏదైతే ఉందో, దాన్ని తీసుకువచ్చి ఇన్‌స్టిట్యూట్‌ని డెవలప్ చేస్తున్నాను అన్నారు. గీతం యూనివర్సిటీలో ఎంతో ఇష్టంతో భవనాల్ని డిజైన్ చేయడం జరిగింది.

అలాగే, గీతంలో Gandhian Philosophy కోర్సుని కూడా వారు ప్రవేశపెట్టారు. ఆయన మనస్సుని అంతగా ఆకట్టుకున్న వ్యక్తి మహాత్మాగాంధీ గారు. కాబట్టి, గాంధీ గారి పేరు మాత్రమే కాకుండా, వారి విగ్రహాన్ని కూడా క్యాంపస్‌లో పెట్టారు. అలాగే, Gitam School of Gandhian Studies పెట్టిన తరువాత ఇంకొక పెద్ద విగ్రహం పెట్టడం జరిగింది. గాంధీ గారి ఆర్టికల్స్ ఏవైతే ఉన్నాయో, వాటి నమూనాలను కూడా ఆ భవనంలో పెట్టడం జరిగింది. అలాగే, ఎంఏ, బిఏ కోర్సులు కూడా ప్రారంభించడం జరిగింది. అలాగే, గాంధీయన్ ఫిలాసఫీ మీద రీసెర్చ్‌కి సంబంధించిన అంశంలో పిహెచ్‌డీ చేయడానికి అర్హతకలిగే విధంగా ఆలోచన చేయాలని, డాక్టోరల్ డిగ్రీలు ఇవ్వాలనే ప్రయత్నం కూడా గీతంలో ప్రారంభమయ్యింది.

అదేవిధంగా ప్రతి బిల్డింగ్‌కు కూడా ఒక పేరుపెట్టడం గమనిస్తే, చంద్రహాస అని ఒక భవనానికి పేరు పెట్టారు. అది చత్రపతి శివాజీ గారి ఖడ్గం పేరనేది చాలా మందికి తెలియదు. అలాగే, శివాజీ గారి విగ్రహం కూడా చాలా పెద్దది పెట్టడం జరిగింది. గీతంలో టెంపుల్ లేదంటే టెంపుల్ కూడా నిర్మాణం చేయడం జరిగింది. నేను స్టూడెంట్ ఆర్గనైజేషన్‌లో పనిచేస్తుంటే ఎబివిపి తరఫున మెంబర్‌షిప్ కావాలంటే అలౌ చేసేవాళ్లు కాదు. ఏంటి సార్, మీరు పొలిటీషియన్ అయ్యుండి కూడా స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఇక్కడ రానివ్వకపోతే ఎలాగండి, స్టూడెంట్స్ కూడా పాలిటిక్స్ గురించి తెలుసుకోవాలి కదా అనంటే, '' నేను మాత్రం మా పార్టీతో సహా ఏ జెండాను కూడా క్యాంపస్ లోపలికి రానివ్వను'' అని మాకు గట్టిగా చెప్పారు. అలాగే, మేము ప్రతి ఏటా ఇంజనీరింగ్ కాలేజీలకు ర్యాంకింగ్స్ ఇస్తుంటాము. ఒక సంవత్సరం ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో రాజాంలోని జిఎంఆర్ ఇన్‌స్టిట్యూట్‌కి ఫస్ట్ ర్యాంక్ ఇచ్చాము. ఆ తరువాత గీతం కాలేజీకి ఇవ్వడం జరిగింది. ఆ సందర్భంలో ఈయన పిలిచి, ఏవిధంగా మీరు ఆ కాలేజీకి ర్యాంకు ఇచ్చారని అడిగారు. అలా అన్నప్పుడు, మేము ఫలానా పద్ధతి ఫాలో అవుతాము, ఈ విధంగా ర్యాంకింగ్ ఇచ్చామన్నాము. మరి గీతంలో సౌకర్యాలు ఏం తక్కువున్నాయని వారు అడిగితే, రెండు సౌకర్యాలు తక్కువని చెప్పాము. ఒకటి లైబ్రరీ..

అధ్యక్షా, ఏమి తక్కువ ఉందంటే... ఒక హైక్లాస్ లైబ్రరీ తక్కువ వుంది. అన్ని ఇంజనీరింగ్ కాలేజీలకు సెపరేట్ లైబ్రరీ, మేనేజ్‌మెంట్ లైబ్రరీ ఉంది కాని, గీతంలో లేదు కాబట్టి అన్నింటికీ కలిపి ఒక ఐటి హబ్‌లాంటిది

ఉండాలంటే, ఒక నాలెడ్జ్ సెంటర్‌ని వారు స్టార్ట్ చేయడం జరిగింది. వరల్డ్ క్లాస్ నాలెడ్జ్ సెంటర్‌ని ఆ రోజుల్లో తయారుచేశారంటే, ఆయనకుండే విజన్ మనకు అర్థమౌతుంది. రెండవది, హాస్టల్ ఫెసిలిటీ లేక గీతం విద్యార్థులు అనేకమంది బయట హాస్టళ్లలో ఉండేవాళ్లు. కనుక, హాస్టల్ నిర్మాణం చేయాలి, ఈ రెండూ కూడా గీతం యూనివర్సిటీకి మైనస్ అయ్యాయని అంటే, సంవత్సరంలోపు ఒక నాలెడ్జ్ సెంటర్‌ని వారు ప్రారంభించడం జరిగింది. అలాగే, అత్యాధునికమైన హాస్టల్‌ని నిర్మించి, దాంట్లో మంచి భోజనవసతి సదుపాయాన్ని కల్పించి నీట్‌గా తయారుచేయడం జరిగింది. ఆ తరువాత మమ్మల్ని కూడా తీసుకువెళ్లి చూపించడం, అలాగే భోజనం పెట్టడం జరిగింది. ఆవిధంగా వారు ఏది మొదలుపెట్టినా కూడా బెస్ట్‌గా ఉండాలనే ప్రయత్నం కనిపిస్తుంది.

అలాగే, ఆయనకు అత్యంత ఇష్టమైనది పార్లమెంట్. ఆయన గీతం కాలేజీలోనే పార్లమెంట్ నమూనాను కలిగిన ఒక బిల్డింగ్‌ని తయారుచేశారంటే, ఆయనకు పార్లమెంట్ అంటే ఎంత ఇష్టమో మీకు అర్థమతుంది. ఆయన రెండుసార్లు లోక్‌సభకు ఎన్నిక కావడం జరిగింది. చివర్లో మాత్రం ఆయన రాజ్యసభకు ఎన్నిక కావాలనే కోరికను వ్యక్తపరచడం జరిగింది. ఆయనకు జీవితంలో ఇదొక తీరని కోరికగా ఉండిపోయింది. అలాగే, ఈ సంవత్సరం మహాత్మాగాంధీ గారి 150వ జయంతి. అది కూడా గీతం కాలేజీలో ఘనంగా చేయాలని కోరుకోవడం జరిగింది. ఎందుకంటే, నేను గీతం ఇన్‌స్టిట్యూట్ అని పెట్టాను, గాంధీయన్ సెంటర్ పెట్టాను కదా తప్పనిసరిగా ఆ విధంగా గాంధీ జయంతిని చేయాలనే ఆలోచన కూడా నాలో ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తపరచారు.

మ.12.00

ఆయన ఒక successful academician, very successful entrepreneur. కేవలం ఒక ఇండస్ట్రీ అని కాదు, అన్ని రకాల ఇండస్ట్రీస్ – ఉదాహరణకు power sector, exports, bottling company, shipping company including Ferro Alloys లను ఏర్పాటు చేయడం జరిగింది. రాజకీయ నాయకుడిగా వారు అనేక విజయాలను సాధించడం జరిగింది. మేము1999లో ఆయనను దగ్గరగా చూడడం జరిగింది. అప్పుడు మేము కలిసి పోటీ చేశాము. హరిబాబుగారు ఎం.ఎల్.ఏగా పోటీ చేస్తే ఆయన పార్లమెంటుకు పోటీ చేశారు. Electioneering సందర్భంలో అంటే అభ్యర్థి నామినేషన్ వేసే సమయం దగ్గర నుండి కౌంటింగ్ వరకు ప్రతి విషయంలో ఎంతో శ్రద్ధగా, meticulous గా workout చేసిన తీరు పట్ల మేము ఎంతో ఆకర్షితులమయ్యాము. ఆ విధంగా ఆయన ఒక సార్థకజీవి. అనేక రకాలుగా విజయాలు సాధించిన వ్యక్తి. క్రమశిక్షణ, పట్టుదలకు మారుపేరు మూర్తిగారు. వారి ఆత్మకు సద్గతులు ప్రాప్తించాలని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ విరమిస్తున్నాను.

**శ్రీ రాము సూర్యారావు (ఉపాధ్యాయ నియోజకవర్గం – తూర్పు, పశ్చిమ గోదావరి):** అధ్యక్షా, శ్రీ ఎం.వి.వి.ఎస్. మూర్తి గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు గారు చెప్పినట్లు ఒక మంచి కుటుంబానికి చెందిన వ్యక్తి. నేను పరిశీలించినంతవరకు మర్యాదలకు మంచి పేరు తూర్పు గోదావరి జిల్లా. ఈ విషయం అందరికీ తెలుసు. ఆ జిల్లా నుండి వచ్చిన వ్యక్తి మూర్తిగారు. మర్యాద, సత్సంప్రదాయాలకు విలువిచ్చేవారు.

తూర్పు గోదావరిలో జిల్లాలో చాలామంది కోడి పందాలు, జూదాలు ఆడిస్తుంటే ఫైనాన్స్ మినిస్టర్ గారు మాత్రం వారి ప్రాంతంలో చక్కటి సంప్రదాయబద్ధమైన ఆటలు పెట్టించారు. అంత కల్చరల్ కుటుంబం మూర్తిగారి కుటుంబం కూడా అని నేను మనవి చేస్తున్నాను. నేను, జగదీశ్వర రావుగారు ఎథిక్స్ కమిటీలో సభ్యులుగా ఉన్నప్పుడు తిరుపతి వెళ్లిన సందర్భంలో అక్కడ ఎలా ప్రవర్తించాలి, చక్కని సంప్రదాయాల గురించి చెప్పిన వ్యక్తి మూర్తిగారు. చాలామంది సభ్యులు చెప్పినట్లు ఆయన గొప్ప మానవతావాది. ఎవరైతే సేవలు చేస్తారో వారిని మూర్తిగారు బాగా ఇష్టపడేవారు. ఒక సందర్భంలో "మీరు మానవతావాది కాబట్టి మిమ్మల్ని ముఖ్యమంత్రిగారు ఇష్టపడుతున్నారు, నేను గీతంకు తీసుకువెళ్లి మీకు సన్మానం చేస్తానని" అని ఆయన నాతో అన్నారు. ఏలూరులో ఎన్.ఆర్.ఐ.లు వారికి సన్మానం చేసినప్పుడు "నాకు కాదు సన్మానం చేయవలసింది – ఈయనకు" అని నన్ను చూపించారు. అంతటి ఔన్నత్యం గల వ్యక్తి ఆయన. అంతేకాదు, ప్రతిపక్షం వారు ఎలాగూ సభలోకి రావడం లేదు కాబట్టి, ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేసేట్లు చూడాలనే ముఖ్యమంత్రిగారి ఆలోచనల ప్రకారం మూర్తిగారు అన్ని విషయాలు చదివి, అన్ని విషయాలపై మంత్రులద్వారా సమాధానం వచ్చేలా తద్వారా ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేసేందుకు కృషి చేశారు. అలాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని, వారి ఆలోచనలను మనం పాటించినప్పుడే సమర్థవంతమైన ప్రభుత్వానికి మనం తోడ్పడతామని నేను అభిలషిస్తూ, నాకు ఈ అవకాశం ఇచ్చిన మీకు కృతజ్ఞతలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ జి. తిప్పేస్వామి:** అధ్యక్షా, డా. ఎం.వి.వి.ఎస్. మూర్తిగారు ఈ సభలో లేకపోవడం ఈ సభకు, తెలుగుదేశం పార్టీకి తీరని లోటు. విద్యావేత్తగా, రాజకీయ వేత్తగా, మానవతావాదిగా చాలా చక్కగా పనిచేశారు. గత సభలోనే నాకు వారు పరిచయం. బెంగళూరుకు మా నియోజకవర్గానికి మధ్యలో గీతం యూనివర్సిటీ ఉన్నది. మాది వెనుకబడిన ప్రాంతం కాబట్టి విద్యార్థులకు సీట్లు కావాలని అడిగితే ఇచ్చేవారు. మా ప్రాంతానికి ఒకసారి రావాలి, ఒక మెడికల్ కాలేజీ పెట్టాలి, కాలేజీ వస్తే హాస్పిటల్ వస్తుందని చాలాసార్లు నేను మూర్తిగారిని రిక్వెస్ట్ చేశాను. తప్పకుండా మీ ప్రాంతానికి వచ్చి చూస్తాము, అయినా ఈ కాలంలో మెడికల్ కాలేజీ పెట్టడం చాలా కష్టమైనది, మీద వెనుకబడిన ప్రాంతం కాబట్టి ఒకసారి ఆలోచిస్తామని అన్నారు. అంతలోనే వారు లేకుండా పోవడం చాలా బాధాకరం. ఏదేమైనా మూర్తిగారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**డా. గాదె శ్రీనివాసులు నాయుడు (ఉపాధ్యాయ నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం):** అధ్యక్షా, ఎం.వి.వి.ఎస్. మూర్తిగారు మనమధ్య లేరన్న విషయం చాలా బాధాకరం కౌన్సిల్‌కి వారు వచ్చినప్పటి నుండి అందరినే కలుపుకుంటూ మాట్లాడేవారు. వారు ప్రశ్న లేకుండా ఏనాడూ క్వశ్చన్ అవర్ ఉండేది కాదు. అన్ని అంశాలను వారు స్పృశిస్తూ కౌన్సిల్ ద్వారా ఈ కార్యక్రమాలను చెయ్యాలనే మార్గదర్శకంగా వారు పనిచేశారు. వారు తూర్పుగోదావరి జిల్లాలో 1938వ సంవత్సరంలో జన్మించారు. 3 సంవత్సరాల వయసులోనే

తండ్రిని కోల్పోయారు. వారి భార్య పశ్చిమగోదావరి జిల్లాకు చెందినవారు. ఆ విధంగా ఆ జిల్లాతో అనుబంధం ఏర్పడింది. విశాఖపట్టణంలో స్థిరపడడం వల్ల ఆ జిల్లాతో కూడా అనుబంధం ఉన్నది. అనేక సేవాకార్యక్రమాల ద్వారా మరియు అనేక రంగాల ద్వారా వారు ఈ మూడు జిల్లాల ప్రజలకు సన్నిహితులయ్యారు. అందుకనే ముఖ్యమంత్రిగారి స్ఫూర్తి మేరకు జన్మభూమి కార్యక్రమం క్రింద మాచెర్ల గ్రామంలో అన్ని రకాల కార్యక్రమాలు చేపట్టారు. ఒక పార్క్, కాలేజీ పెట్టి అందరికీ మార్గదర్శకులయ్యారు.

గోల్డ్‌స్పాట్ కంపెనీని ప్రారంభించి పారిశ్రామికవేత్తగా ఎదిగారు. వారి అబ్బాయికి ఇంజనీరింగ్ సీటు రాలేదన్న బాధతో గీతం ఇంజనీరింగ్ కాలేజీని ప్రారంభించి ఈనాడు పెద్ద విశ్వవిద్యాలయంగా దానిని అభివృద్ధి చేసి ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యనందించారు. గాంధీగారంటే వారికి బాగా ఇష్టం. చివరకు మూర్తిగారు చనిపోయే ముందురోజు కూడా కన్వెన్షన్ హాల్‌లో గాంధీగారి విగ్రహానికి పూలమాల వేసి ఫ్లైట్‌లో వారు అమెరికా వెళ్లడం జరిగింది. దుర దృష్టవశాత్తు అక్కడ యాక్సిడెంట్‌లో ప్రాణాలు కోల్పోవడం జరిగింది. 1982వ సంవత్సరంలో ఎన్.టి.రామారావుగారు పార్టీ పెట్టినప్పుడు 1983లో మూర్తిగారిని ఆహ్వానించారు. అప్పుడు ఆయన నాకు రాజకీయాలు వద్దు, ఇండస్ట్రియలిస్టుగా ఉన్నాను కదా అని అన్నప్పుడు రామారావుగారు "రోజుకు లక్ష రూపాయల ఇన్‌కంను వదులుకుని సేవచేయడానికి నేను వస్తున్నప్పుడు, మీరు రావడంలో తప్పు లేదని" ఒక్కమాట చెప్పారట. ఆ మాటను అనుసరించి వారు పార్టీలోకి వచ్చారు. రామారావు గారు ఆహ్వానించిన మేరకు వారు పార్టీలోకి వచ్చి రెండుసార్లు పార్లమెంట్ సభ్యులుగా పనిచేసి ఎక్కడా వివాదాలు లేకుండా, మచ్చలేని నాయకుడిగా అనేక సేవలందించారు. ఒకేపార్టీ విధానాన్ని పాటిస్తూ, విశాఖపట్టణంలో కూడా తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని సుందరమైన భవనంగా నిర్మించి ప్రియతమ ముఖ్యమంత్రి చేత అనేక ప్రశంసలు పొందిన వ్యక్తి మూర్తిగారు. ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరం. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను.

**శ్రీమతి పాముడి శమంతకమణి (శాసనసభా నియోజకవర్గం):** ఈనాడు ఎం.వి.వి.ఎస్. మూర్తిగారి కీర్తిని ఇంతమంది పెద్దలు కొనియాడుతున్నారంటే అందుకు కారణం వారు ధన్యజీవి. జీవి కళ్లు తెరిస్తే జననం, కళ్లు మూస్తే మరణం అంటారు. జీవించిన ఆ మధ్యకాలంలో మంచి పనులు చేసినవాడే ధన్యజీవి అవుతాడు. ఆయన చేసిన మంచిపనులు ఒక్కొక్కటి మనం గమనిస్తే చిన్నప్పటినుండి వారు నేర్చుకున్న జీవిత పాఠాలు వారిని ఉన్నత స్థానానికి తీసుకువచ్చిందని నేను భావిస్తున్నాను. ఈ సభకు ఒక గంభీరతను, పెద్దరికాన్ని, ధీరత్వాన్ని తీసుకువచ్చారు. వారి ప్రశ్నావళితో మొదలైన ఈ సభ ఆయన లేకుండా చిట్టచివరకు వచ్చిందంటే బాధాకరం. ఏదేమైనా పెద్దలు మూర్తిగారు వారి జీవిత కాలంలో పిల్లలకు మంచి భవిష్యత్తును చూపించి స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని అనుభవించారు కాబట్టి వారు ధన్యజీవి అని నేను అనుకుంటున్నాను. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను.

**శ్రీ కత్తి నరసింహారెడ్డి (ఉపాధ్యాయ నియోజకవర్గం – కర్నూలు, అనంతవరం, కడప):** అధ్యక్షా, ఈ సభలో సీనియర్ ప్రజాప్రతినిధులలో ఒకరిగా అందరూ అభిమానించే, గౌరవించే పెద్దలు, మూర్తిగారిగా పిలవబడే మతుకుమిల్లి వీర వెంకట సత్యనారాయణ మూర్తి గారు 2018, అక్టోబరు 1వ తేదీన అమెరికా రాష్ట్రమైన అలాస్కా లో రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం మనసును కలచివేసే బాధాకరమైన అంశం. వారి సన్నిహితులు చౌదరి గారు కూడా మరణించడం విచారకరం. తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి ప్రాంతానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ విశాఖపట్టణంలో స్థిరపడి వ్యాపార రంగంలో గోల్డ్‌స్పాట్ మూర్తిగా 1980 –90 మధ్యకాలంలో పేరు గడించి, గాంధీ సిద్ధాంతాలకు ఆకర్షితులై గాంధీ పేరుతోనే గీతం విద్యా సంస్థను స్థాపించి, ఎంతోమంది ఉన్నత స్థానానికి ఎదగడానికి విశేష కృషి చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందడం జరిగింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తరువాత ఎన్‌టి రామారావు గారి పిలుపునందుకొని పార్టీలోకి వచ్చి రెండు పర్యాయాలు పార్లమెంట్ సభ్యులుగా పనిచేశారు. ఎం.ఎల్.సి.గా చేస్తున్న సందర్భంలో మేము వారిని సన్నిహితంగా చూడగలిగాము. క్వశ్చన్ అవర్‌కు సంబంధించి సాధారణంగా ఎవరమైనా 5, 10 ప్రశ్నలు వేయగలము.

వం.12.10

కానీ, వందకు పైగా ప్రశ్నలను ఒక సెషన్‌లోనే ఇచ్చే సభ్యులు చాలా అరుదుగా ఉంటారు. అది స్వర్గీయ డా.ఎం.వి.వి.ఎస్. మూర్తి గారికే సాధ్యమైందనే విషయాన్ని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను. మాలాంటి సభ్యులందరికీ కూడా ఆయన ఎంతో ఆదర్శనీయులు. సూటిగా, ధాటిగా, ధీటుగా సమాధానాన్ని రాబట్టడంలో కూడా ఆయన సభ్యులందరికీ ఆదర్శంగా నిలిచారు. అలాగే, రాజకీయవేత్తగా ఉంటూ తన జన్మస్థానానికి జన్మభూమి కార్యక్రమంలో భాగంగా సేవచేయడంతో పాటు విశాఖపట్నం జిల్లా అనకాపల్లి మండలంలోని సంపతిపురం గ్రామాన్ని దత్తత తీసుకుని సుమారు రూ.2కోట్లతో రహదారులు, త్రాగునీటి సౌకర్యం, మ్యారేజి హాలు మరియు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటుచేసి ఆ విధంగా ఆయన దత్తత తీసుకున్న గ్రామాన్ని అభివృద్ధి చేయడం జరిగిందని తమరిద్వారా నేను మనవిచేస్తున్నాను. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలనే దానికి నిలువెత్తు నిదర్శనం స్వర్గీయ డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి గారు. ఒక మంచి విద్యావేత్తగా, వ్యాపారవేత్తగా, రాజకీయవేత్తగా అన్నింటికీ మించి ఒక మానవతావాదిగా అందరికీ ఆదర్శనీయులుగా ఉన్న వ్యక్తి మన నుంచి దూరం కావడంతో తీవ్ర మనస్తాపం చెందుతూ, వారి మృతికి నా సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తమరిద్వారా వ్యక్తపరుస్తున్నాను.

**శ్రీ పి. రామ సుబ్బారెడ్డి:** అధ్యక్షా, స్వర్గీయ డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి గారి అకాల మరణం అందరినీ ఎంతో కలచివేసింది. ఆయన గురించి గౌరవసభ్యులు, సీనియర్ నాయకులందరూ చెప్పిన విషయాలతో నేను ఏకీభవిస్తున్నాను. ఆయన ఎంతో క్రమశిక్షణతో మెలిగిన ఒక గొప్ప వ్యక్తి. గౌరవ మంత్రి శ్రీ నారా లోకేశ్ గారు చెప్పినట్లు 3 సంవత్సరాల వయస్సులోనే డా.ఎం.వి.వి.ఎస్. మూర్తిగారు తన తండ్రిగారిని కోల్పోయినప్పటికీ, ఎంతో

ఉన్నత స్థాయికి ఎదిగి, సమాజం గుర్తించే విధంగా ఎంతో మంచిపేరు తెచ్చుకున్నారు. ఆయనను నేను కూడా కలవడం జరిగింది. ఆయన మమ్మల్ని ఎంతో ఆప్యాయంగా పలకరించేవారు. ఆయన మన సభలో ఉన్నప్పుడు ప్రతిరోజు ఆయన వేసిన 2 లేదా 3 ప్రశ్నలు చర్చకు వచ్చేవి. ప్రజల సమస్యలపై కేవలం ప్రశ్నలు వేయడమే కాకుండా ఎంతో అవగాహనతో ఆ సమస్యలకు పరిష్కారం కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన సీనియర్ నాయకులు స్వర్గీయ డా.ఎం.వి.వి.ఎస్. మూర్తి గారు. వారి అకాలమరణం ఆయన కుటుంబానికే కాకుండా, తెలుగుదేశం పార్టీకి కూడా ఎంతో తీరని లోటు. స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారి పిలుపు మేరకు పార్టీలో చేరి, ఆనాటి నుంచి తెలుగుదేశం పార్టీకోసం ఆయన ఎంతో కృషిచేశారు. అదేవిధంగా, ఆయన సమాజానికి కూడా ఎంతో సేవ చేశారు. ఒక విద్యావేత్తగా, ఒక పారిశ్రామికవేత్తగా, ఒక రాజకీయవేత్తగా ఉన్నతమైన విలువలతో కూడుకున్నటువంటి ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయం. వారి అకాలమరణానికి చింతిస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు తమరిద్వారా నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్ (స్థానిక సంస్థలు – కృష్ణా):** అధ్యక్షా, స్వర్గీయ డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి గారు మన నుంచి దూరమయ్యారంటే చాలా బాధాకరంగా ఉంది. ఆయన ఎంతో సీనియర్ నాయకుడు పార్లమెంటు సభ్యునిగా రెండు పర్యాయాలు పనిచేసి, శాసనపరిషత్ సభ్యునిగా మనతో ఉన్నప్పటికీ ఎంతో low profile మెయింటైన్ చేస్తూ, మాలాంటి చిన్నవాళ్లను కూడా ఏమండీ అని పిలుస్తూ ఉండేవారు. మన సభలో ఆయన అన్ని చర్చల్లో చాలా ఉత్సాహంగా పాల్గొనేవారు. నిజమైన పార్లమెంటేరియన్‌గా ఆయన మనందరికీ కూడా ఎంతో ఆదర్శవంతంగా ఉండడం జరిగింది. సభలో ప్రశ్నలు వేసే విషయంలో ఆయనకు ఎంతో ప్రత్యేకత ఉండేది. కీర్తిశేషులు డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి గారు మరియు గౌరవసభ్యులు శ్రీ చౌదరి గారు ఇద్దరూ కలిసి జాయింట్‌గా ప్రతి సెషన్‌కు సుమారు 100కు పైగా ప్రశ్నలు ఇస్తూ ఉండేవారు. వారు వేసిన ఒకటి లేదా రెండు ప్రశ్నలు ప్రతిరోజు ఉండేవి. వారికంటే ఎక్కువ ప్రశ్నలు ఇవ్వాలని మేము కూడా ప్రయత్నించి 60 లేదా 70 ప్రశ్నల కంటే ఎక్కువగా మేము తయారుచేయలేకపోయాము. మూర్తి గారూ, ఈ ప్రశ్నలన్నీ మీ విశ్వవిద్యాలయంలో ఉన్న ప్రొఫెసర్లతో తయారుచేయిస్తున్నారా, ఇన్ని రకాల ప్రశ్నలు ఎలా తయారుచేయగలుగుతున్నారని మేము వారిని అడిగితే, 'లేదు, నేనే స్వయంగా ప్రశ్నలను ప్రిపేర్ చేస్తానని' ఆయన మాతో చెప్పారు. ఆయన ఒక పారిశ్రామికవేత్తగా, ఒక విద్యావేత్తగా, ఒక రాజకీయవేత్తగా ఉండి ఎంతో ఓపికగా కూర్చుని అన్ని ప్రశ్నలను ఆయనే స్వయంగా తయారుచేసుకుని వాటిని సరైన సమయంలో అందించి, వాటిపై సభలో చర్చించడం నిజమైన పార్లమెంటేరియన్‌గా మనందరికీ ఆదర్శవంతంగా ఆయన పనిచేశారు. కీర్తిశేషులు డా. ఎం.వి.వి.ఎస్. మూర్తిగారి మరణానికి నా సంతాపాన్ని ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తమరిద్వారా నేను తెలియజేస్తున్నాను.

**శ్రీ నారా చంద్రబాబు నాయుడు:** అధ్యక్షా, ఒక్కొక్కసారి విధి చాలా బలమైనది. గత సమావేశాల సమయంలో మూర్తిగారు నా ఛాంబర్‌కు వచ్చి సమావేశాల తర్వాత అమెరికాకు వెళ్లి వస్తానని నాకు చెప్పడం జరిగింది. ఏదైనా బిజినెస్ పనిపై వెళుతున్నారా అని నేను ఆయనను అడిగితే, కాదు, అమెరికాలో వారం లేదా పది రోజులుండి అందరినీ పలకరించి వస్తానని చెప్పి నాకు ఆయన చెప్పడం జరిగింది. ఆయన వెళ్లిన ప్రాంతం అమెరికాలో కొద్దిగా ఇంటీరియర్ ప్రాంతమైన అలాస్కా. అది ఎంతో సుందరమైన ప్రాంతం. ప్రకృతిని చూడాలని, అక్కడ కొద్దిరోజులు గడపాలనే ఉద్దేశంతో అంత దూరం ఆయన వెళ్లి అక్కడ రోడ్డు ప్రమాదంలో చనిపోయారంటే, ఒక్కొక్కసారి మనం నిమిత్తమాత్రులమని అనిపిస్తుంది. భారతదేశంలోని మన రహదారుల కంటే, అమెరికాలోని రహదారులు మరియు డ్రైవింగ్ కూడా చాలా బాగుంటుందని సహజంగా మనం అనుకుంటాము. అటువంటి అమెరికాలో ఇటువంటి ప్రమాదం జరగడం చాలా దుర దృష్టకరం. మృత్యువు మనల్ని ఎప్పుడూ వెంటాడుతూ ఉంటుందనే దానికి ఈ సంఘటన ఒక ఉదాహరణ.

అధ్యక్షా, కీర్తిశేషులు డా. ఎం.వి.వి.ఎస్. మూర్తిగారి జీవితం భావితరాలకు కూడా ఎంతో ఆదర్శం. తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి మండలం మూలపాలెం గ్రామంలో ఆయన జన్మించారు. 1996 సంవత్సరంలో తుపాను వచ్చినపుడు నేను ఆ గ్రామంలో బలవంతంగా దిగి అక్కడున్న బాధితులను పరామర్శించాను. అది నాకు ఇప్పటికీ జ్ఞాపకముంది. ఆ గ్రామాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేసి, సంక్రాంతి వంటి పండుగలు వచ్చినపుడు కుటుంబసభ్యులంతా ఆ గ్రామానికి రావాలని ఒక సంప్రదాయంతో కూడిన షరతు పెట్టి జన్మనిచ్చిన స్థలాన్ని మర్చిపోకుండా ఆ జన్మభూమిని గౌరవించిన వ్యక్తి కీర్తిశేషులు శ్రీ ఎం.వి.వి.ఎస్. మూర్తి గారు. ఆయన విలువలతో కూడిన వ్యక్తి. అందరితో కలుపుగోలుగా ఆయన ఉండేవారు. ఆయన అందరితో నవ్వుతూ, ఎంతో ఆప్యాయంగా మాట్లాడేవారు. ఆయన గాంధేయవాది, ఎంతో సింపుల్‌గా ఉండేవారు. ఆయన ఎంతో ఉన్నతమైన ఆలోచనలు కలిగి ఉండేవారు. ఒక పారిశ్రామికవేత్తగా, ఒక విద్యావేత్తగా మరియు రాజకీయవేత్తగా ప్రజలకు మెరుగైన సేవను అందించడంలో ఆయనకు ఆయనే సాటి. ఎంతోమంది జన్మిస్తారు, మరణిస్తారు. కేవలం కొంతమందిలో మాత్రమే అచంచలమైన విశ్వాసంతో ఒక వ్యక్తి ఒక శక్తిగా మారతారు. వారు ఎన్నో వ్యవస్థలకు రూపకల్పన చేస్తారు. అటువంటి వ్యక్తి కీర్తిశేషులు డా. ఎం.వి.వి.ఎస్. మూర్తిగారు. కొంతమంది కొన్ని రంగాల్లో మాత్రమే రాణిస్తారు. కానీ, ఆయన ఒక పారిశ్రామికవేత్తగా అప్పట్లో ఎవరూ చేయనపుడు గోల్డ్‌స్పాట్ కంపెనీని స్థాపించి గోల్డ్‌స్పాట్ మూర్తిగా పేరు గడించారు. ఆ తర్వాత ఒక మంచి విద్యావేత్తగా కూడా ఆయన పేరుగాంచారు. నేడు గీతం యూనివర్సిటీని ఒక డీమ్డ్ యూనివర్సిటీగా, అత్యున్నతమైన విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా, ఒక మంచి సంస్థగా ఆయన తయారుచేశారు. ఒక విజన్‌తో చేస్తే తప్ప అది సాధ్యం కాదు.

అధ్యక్షా, తెలుగుదేశం పార్టీని స్థాపించినపుడు స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారు పిలిస్తే ఆయన వచ్చి తెలుగుదేశం పార్టీలో చేరారు. విశాఖపట్నంలో అప్పుడు మూర్తిగారు, గంగిరెడ్డి గారని మరొకాయన ఉండేవారు. వీరిద్దరూ కలిసి తెలుగుదేశం పార్టీని ఎప్పుడూ బలపరిచేవారు. విశాఖపట్నం వెళితే తెలుగుదేశం పార్టీ అంటే వెతుక్కునే పనిలేదు. ఒకపక్క మూర్తి గారు, మరొకపక్క గంగిరెడ్డి గారు ఇద్దరూ కలిసి పనిచేసే వారు. ఎక్కడా రెండో ఆలోచన లేకుండా ఎంతో పట్టుదల, కమిట్‌మెంట్‌తో పార్టీకోసం వారు పనిచేసే వారు.

అధ్యక్షా, స్వర్గీయ డా. ఎం.వి.వి.ఎస్. మూర్తిగారు విద్యారంగంలో చాలా మందికి ఎంతో ఆదర్శం. ఎవరైనా ఒక విద్యాసంస్థను నెలకొల్పాలంటే, డా. ఎం.వి.వి.ఎస్.మూర్తి గారు నిస్వార్థంగా గీతం విశ్వవిద్యాలయాన్ని ఏ విధంగా అభివృద్ధి చేశారో తెలుసుకుంటే ఒక మంచి ఆలోచన వస్తుంది. మరొకపక్క రాజకీయ నాయకులందరికీ కూడా ఆయన ఎంతో ఆదర్శం. ఆయన ఏ పదవిలో ఉన్నా ఆ పదవికి వన్నె తెస్తూ, ఎంతో ఆదర్శవంతంగా ముందుకు వెళ్లారు. ఎంతో కలుపుగోలుతనంగా మాట్లాడుతూ, ఎక్కడా మాట తూలకుండా ఆయన పనిచేశారు. ఆయనకు ఎవరితోనూ విరోధం లేదు.

వం.12.20

అధ్యక్షా, డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తిగారు ఇలా ఎన్నో కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు పోయారు. అలాగే పార్టీకోసం చాలా కష్టపడి పనిచేశారు. 1987 నుంచి 1989 సంవత్సరం వరకు విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ అధ్యక్షులుగా పనిచేశారు. క్లీన్ విశాఖ – గ్రీన్ విశాఖ పేరుతో ఆరోజుల్లోనే ప్రారంభించి చెట్లు నాటడం, సుందరీకరణ చేయడం వంటివి చేస్తూ ఆ ప్రాంతాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. 1991, 1999 సంవత్సరాలలో రెండుసార్లు పార్లమెంటు సభ్యులయ్యారు. అదేవిధంగా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా కూడా సత్కారాలు అందుకున్నారు. శాసనపరిషత్తులో ఉండాలని ఆయన ఎప్పుడూ కోరుకోలేదు. నవ్యాంధ్రప్రదేశ్ రాగానే మీరు శాసనపరిషత్తులో సభ్యులుగా ఉండమని, తరువాత మీరు కావాలంటే పార్లమెంటుకు వెళుదురుకానీ అని మేమే ఆయనకు చెప్పాము. అప్పుడు అందరి కోరిక మేరకు శాసనపరిషత్తు సభ్యులుగా ఆయన నిలబడి పోటీ చేసి గెలిచారు.

అధ్యక్షా, జీవితమనేది క్షణికం. కానీ మన జీవిత కాలంలో మనమేం చేస్తున్నాం. సమాజానికి ఏం చేస్తున్నాం అనేదే శాశ్వతం. అదే మూర్తిగారి విషయంలో నిజమైంది. ఒక వ్యక్తిగా చిన్న కుటుంబంలో పుట్టినా చిన్న వయసులోనే తండ్రి చనిపోయినా పట్టుదలతో పైకి వచ్చిన వ్యక్తి. నిరంతరం శ్రమ పడి పైకి వచ్చిన వ్యక్తి. నాకు గత 35 సంవత్సరాలుగా మూర్తిగారితో పరిచయం. ఈ 35 సంవత్సరాలు ఆయన్ని చూశాను. ఎప్పుడూ కూడా చాలా ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా ఉంటారు. ఎవర్నీ ఇబ్బంది పెట్టరు. ఏదైనా పని అప్పచెప్తే మాత్రం చాలా సిన్సియర్‌గా చేస్తారు. ఒక నాయకునికి అలాంటి గుణాలు ఉండడం చాలా అరుదు. ఒక వ్యక్తి బాగా కమ్యునికేషన్ చేసినా ఆర్గనైజేషన్‌లో ఫెయిల్ అవుతారు. ఒక వ్యక్తి వ్యాపారాలు బాగా చేస్తారు, విద్యా సంస్థల విషయాలు తెలియకపోవచ్చు. ఒకరికి

విద్యాసంస్థల విషయాలు తెలుస్తాయి కానీ రాజకీయాలు తెలియవు. కానీ డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తిగారిని చూస్తే పరిపూర్ణంగా ఏ వ్యవస్థలో చెయ్యి పెట్టినా అందులో బ్రహ్మాండంగా చేశారు. విద్యా వ్యవస్థలకు వెళ్లి ఈరోజు గీతం విశ్వవిద్యాలయాన్ని ఒక మోడల్ వ్యవస్థగా తీర్చిదిద్దారు. దేశంలో ఒక మోడల్‌గా వారి విద్యాసంస్థలు నిలిచాయి. మంచి విద్యాసంస్థలుగా వాటిని అభివృద్ధి చేశారు.

అధ్యక్షా, రాజకీయాల్లో సాధారణంగా గ్రూపులు, వర్గాలు ఉండే పరిస్థితి ఉంటుంది. అలాంటి స్థితిలో ఒక అజాత శత్రువుగా, అందరికీ ఆమోద యోగ్యంగా పనిచేశారు. ఇవన్నీ చాలా అరుదైన గుణాలు. ఏదేమైనా డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తిగారు మన మధ్యలో లేరు కానీ ఆయన స్ఫూర్తి మాత్రం ఎప్పటికీ నిలిచి ఉంటుంది. అలాంటి వ్యక్తి ఇంకా ఎక్కువ రోజులుంటే సమాజానికి బాగా ఉపయోగపడేవారు. ఇంకా అనేక కార్యక్రమాలు చేసేవారు. అనునిత్యం ఒక వ్యవస్థ మాదిరిగా పనిచేశారు తప్ప ఒక వ్యక్తిగా కాదు. అలాంటి వ్యక్తి చనిపోవడం బాధాకరం. డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తిగారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఆయన ఆత్మకి శాంతి కలగాలని భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ, ఆయన్ని ఒక ఆదర్శంగా తీసుకోవాలని ప్రతి ఒక్కరినీ కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనపరిషత్ సభ్యులు డా.ఎం.వి.వి.ఎస్ మూర్తి గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

డా.ఎం.వి.వి.ఎస్ మూర్తి గారు 1938 జూలై 3న తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి మండలం ఎస్.మూలపాలెం గ్రామంలో జన్మించారు. హైకోర్టులో న్యాయవాదిగా కొంతకాలం ప్రాక్టీస్ చేశారు. 1967లో గోల్డ్‌స్పాట్ పేరుతో సాఫ్ట్‌డ్రింక్స్ వ్యాపారం ప్రారంభించారు. వీరు విశాఖపట్నంలో నెలకొల్పిన గీతం ఇంజనీరింగ్ కళాశాల ప్రస్తుతం డీమ్డ్ వర్సిటీగా విస్తరించింది. డా. ఎం.వి.వి.ఎస్ మూర్తి గారు 1987 నుండి 1989 సంవత్సరం వరకు రెండుసార్లు వుడా ఛైర్మన్‌గా సేవలందించారు. 1991 మరియు 1999 సంవత్సరాలలో విశాఖపట్నం నుంచి ఎం.పిగా ఎన్నికయ్యారు. ఏ.పి. ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షునిగా సుదీర్ఘకాలం పని చేశారు. వారు 2015వ సంవత్సరంలో విశాఖపట్నం స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి శాసనపరిషత్ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

వారు 2018వ సంవత్సరం అక్టోబర్ 2వ తేదీన 80 సంవత్సరాల వయస్సులో మరణించారు.

వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, రెండు నిముషాల పాటు మౌనం పాటిద్దాము.

(గౌరవ శాసనపరిషత్ సభ్యులు డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తిగారి ఆత్మకు శాంతి చేకూరాలని సభ రెండు నిముషాలు మౌనం పాటించింది.)

**మిస్టర్ డెప్యూటీ చైర్మన్:** తిరిగి రేపు తేది.01.02.2019 శుక్రవారం నాడు ఉదయం 10.00 గంటలకు సమావేశమగుటకై సభ వాయిదా వేయడమైనది.

(The House then adjourned at 12.27 p.m. to meet again at 10.00 a.m. on Friday, the 1st February, 2019.)

* * *

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Council and printed at the AP Legislative Assembly Press, Velagapudi, Amaravati.**